ప్రజాశక్తి

సోమవారం 23 సెప్టెంబర్ 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

వరద విపత్తులో చిక్కుకున్న
కుటుంబాల సర్వే పూర్తి

- సచివాలయాల వద్ద అర్హుల జాబితా ప్రచురించాలి
- కలెక్టర్ జె.వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరద విపత్తుకు జలదిగ్బంధంలో చిక్కుకున్న కుటుంబాలన్నింటినీ పక్కాగా సర్వే చేశామని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. వరద విపత్తునకు గురైన ఆయా జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర రెవిన్యూ శాఖ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్ పి సిసోడియ ఆదివారం వీక్షణ సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లాలో నష్టం జరిగిన పరిస్థితులను ఆయన అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల వద్ద అర్హుల జాబితా నోటీసు బోర్డులో ప్రచురించాలన్నారు. సర్వేలో నమోదు కాని వారు తమ సమస్యలపై ఫిర్యాదులు చేసుకోవడానికి సచివాలయంలో లాగిన్ ఇస్తామని చెప్పారు. కష్ణానది పరివాహక ప్రాంతమైన బాపట్ల జిల్లాలోని 24 లంక గ్రామాల ప్రజలకు పూర్తిగా నష్టం వాటిల్లిందని సిసోడియాకు జిల్లా కలెక్టర్ వెంకట మురళి వివరించారు. ఆ గ్రామాలన్నీ జలదిగ్బంధంలో ఉండగా తదుపరి సహాయక చర్యలు చేపట్టామన్నారు. సర్వే బృందాలు ▶ 2లో

'రబీ' నష్టపరిహారం ఏదీ?

- మళ్లీ సీజన్ వచ్చినా అందని సాయం
- కేంద్ర బృందాలు పర్యటించి వెళ్లినా స్పందన శూన్యం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రబీలో కరువు పరిస్థితుల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఇంత వరకూ పరిహారం రాలేదు. మళ్లీ రబీ సీజన్ వచ్చింది. రైతులకు మాత్రం సాయం అందలేదు. ఇటు రాష్ట్ర ప్రభుత్వం గానీ, అటు కేంద్రం గానీ స్పందించిన దాఖలాల్లేవు. ఇప్పుడు వరదలు రావడంతో అందరూ వాటిపై దృష్టి సారించారు. ఉమ్మడి ప్రకాశం నుంచి ఉన్న ఇద్దరు మంత్రులు కూడా పరిహారంపై దృష్టి సారించారా? లేదా? అన్నది సందిగ్ధంగానే ఉంది. ఏదేమైనా రైతులకు మాత్రం సాయం అందలేదు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీ కావడంతో ఇప్పుడు నిధులు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కేంద్రం నుంచి ఏదైనా సాయం అందుతుందా? అంటే అదీ ప్రశ్నార్థకంగానే మారింది. ఇప్పుడు వరదలకు నష్టపోయిన రైతులకు పరిహారం నిర్ణయించారు. అయితే కరువు వల్ల నష్టపోయిన రైతులకు ఎంత వస్తుందనేదీ స్పష్టత లేదు. వ్యవసాయ శాఖ ▶ 2లో

మాట్లాడుతున్న మంత్రి బాలవీరాంజనేయస్వామి

వైసిపి నేతలు అబద్ధాలు చెప్పటం సిగ్గుచేటు

మంత్రి స్వామి

8లో ▲

కేసుల నుంచి
బాలినేని తప్పించుకోలేరు..

- ఏ పార్టీలోకి వెళ్లినా అక్రమాలను బయటకు తీస్తాం..
- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

మాట్లాడుతున్న దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు

ఏ పార్టీలోకి వెళ్లినా కేసుల నుండి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కొడుకు తప్పించుకోలేరని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ తెలిపారు. మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు వర్ధంతి సందర్భంగా టంగుటూరు మండలం, తూర్పునాయుడుపాలెంలో ఆదివారం జరిగిన సభలో ఆయన బాలినేని శ్రీనివాసరెడ్డిపై ఆగ్రహం చేశారు. ఒంగోలులో టీడీపీ శ్రేణులపై బాలినేని అక్రమ కేసులు పెట్టించారన్నారు. తనపై 32 కేసులు పెట్టారన్నారు. తమ నాయకుడు చంద్రబాబుని కూడా బాలినేని దూషించారని గుర్తుచేశారు. అధికారం పోయి 100 రోజులు గడవకముందే బాలినేని పార్టీ మారుతున్నారని, ప్రకాశం జిల్లాలో వైసీపీని ▶ 2లో

జనార్ధన్ వ్యాఖ్యలను
పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తా..

- అనవసరమైన వ్యాఖ్యలు చేయడం సరికాదు
- 26న విజయవాడలో జనసేనలో చేరుతున్నా
- మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వెల్లడి

బాలినేనిని ఆదివారం ఆయన నివాసంలో కలిసిన జనసేన నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

'నా మీద ఒంగోలులో టిడిపి నాయకులు అనేక విమర్శలు చేస్తున్నారు.. వారు చేస్తున్న విమర్శలపై విచారణ జరిపించండి. నా మీద...నా కొడుకు మీద విచారణ చేయించండి' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి 15 రోజుల కిందట నేను లేఖ రాశానని మాజీ మంత్రి, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. విచారణ జరిపించకుండా తన మీద పదేపదే అనవసరమైన విమర్శలు చేయడం దామచర్ల జనార్ధన్‌కు మంచి పద్ధతి కాదన్నారు. దామచర్ల వ్యాఖ్యలను పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆదివారం ఒంగోలు వచ్చిన ఆయన ▶ 2లో

జనార్ధన్ వ్యాఖ్యలను పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తా..

(మొదటిపేజీ తరువాయి)

స్థానిక లాయర్‌పేటలోని తన నివాసంలో అనుచరులతో సమావేశం అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. జనార్ధన్ తనమీద చేసిన వ్యాఖ్యలను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళతానని చెప్పారు. పవన్ కళ్యాణ్ ప్రశ్నించేపార్టీ అని జనసేనను స్థాపించారని, ఆపార్టీలో చేరిన తరువాత తాము కూడా ఎక్కడ ఎలాంటి తప్పు జరిగినా తప్పకుండా ప్రశ్నిస్తామని చెప్పారు. జనసేన పార్టీ ఎమ్మెల్యే ఎవరైనా టిడిపిలో చేరితే తనమీద చేసినట్లే వారిమీద కూడా టిడిపి నాయకులు ఆరోపణలు చేస్తారా...? అని ఆయన ప్రశ్నించారు. తాను ఇటీవల మాట్లాడిన సందర్భంలో కూడా ప్రజలు ఎన్నుకున్న నేతగా నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆయన కార్యక్రమాలు ఆయన చేసుకుంటాడని, జనసేన వాళ్లకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పానని వివరించారు. ఒంగోలులో తన ఫొటోతో, జనార్ధన్ ఫొటోతో ఫ్లెక్సీలు ఎవరు ఏర్పాటు చేశారో తనకు తెలియదని, తన గురించి ఏర్పాటు చేసే ఫ్లెక్సీలలో జనార్ధన్ బొమ్మ వేయవద్దంటే.. అదే విషయాన్ని తాను తన అభిమానులకు కూడా చెబుతానని పేర్కొన్నారు. ఈ నెల 26న పవన్ కళ్యాణ్ సమక్షంలో విజయవాడలో జనసేన పార్టీలో చేరుతున్నానని తెలిపారు. అదే రోజు తనతోపాటు జిల్లాలోని పలు నియోజకవర్గాలకు చెందిన వారు కూడా వైసిపిని వీడి జనసేన పార్టీలో చేరుతారని తెలిపారు. జనసేన పార్టీలో చేరిన తరువాత ఆ పార్టీలో అందరినీ కలుపుకొనిపోయి జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బాలినేని వివరించారు.

కుటుంబాల సర్వే పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో పర్యటించి పక్కాగా సర్వే నిర్వహించాయన్నారు. 499 మంది లబ్ధిదారుల ఈకేవైసీ ప్రక్రియ మిగిలిపోయిందన్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో 200 మంది వివరాలు సర్వే యాప్ లోనే సూపర్వైజర్ లాగిన్‌లో ఉండిపోయాయని చెప్పారు. మరో 250 మంది వివరాలకు సర్వే చేసిన వారి ఐడి నెంబర్ చూపడం లేదన్నారు. 490 చిన్నచిన్న సమస్యలు తలెత్తయని వాటి పరిష్కారానికి అనుమతి ఇవ్వాలన్నారు. వరద నష్టపరిహారానికి అర్హులైన వారి జాబితా సచివాలయాల వద్ద ప్రకటిస్తామన్నారు. సామాజిక తనిఖీ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే లంక గ్రామాలలోని ప్రజలు ఫిర్యాదులు చేసుకోవడానికి సచివాలయాలకు లాగిన్ కేటాయించాలన్నారు. ప్రజలు ఎవరైనా ఆన్ లైన్ లో తమ పేర్లు చూసుకోవడానికి పబ్లిక్ డొమైన్ లో వివరాలను నిక్షిప్తం చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, జలవనరులు, వ్యవసాయ, మత్స్యశాఖ అధికారులు మల్లికార్జున, రామకష్ణ,, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కేసుల నుంచి బాలినేని తప్పించుకోలేరు..

(మొదటిపేజీ తరువాయి)

బాలినేని సర్వనాశనం చేశాడని ఆరోపించారు. జనసేనలో చేరకముందే బెదిరింపులకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో బాలినేని చేసిన అక్రమాలను బయటకు తీస్తామని, ఆయనను పవన్‌కళ్యాణ్ కాపాడతారో? మరేం జరిగిద్దో చూద్దామని అన్నారు. ఎన్నికల్లో కష్టపడి పని చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకి అండగా ఉంటామన్నారు. పార్టీలు మారే పరిస్థితి వస్తే తాము రాజకీయాలు కూడా మానుకుంటామని స్పష్టం చేశారు.

'రబీ' నష్టపరిహారం ఏదీ.?

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు మాత్రం గతంలో ఉన్న నిబంధనల మేరకు పరిహారం అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపారు. అది కూడా రాలేదు. రబీలో వివిధ రకాల పంటలు 29,713.4 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు గుర్తించారు. 36,147 మంది రైతులను బాధితులుగా గుర్తించారు. వీరికి రూ.29.40 కోట్లు పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని అంచనా వేశారు. దర్శి, గిద్దలూరు, కనిగిరి, కొండపి, మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాల్లో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. జిల్లాలో పర్యటించిన కేంద్ర బృందానికి కూడా ఇదే నివేదికను ఇచ్చారు. మార్కాపురం డివిజన్‌లో కేంద్ర బృందం పర్యటించింది. జిల్లాకేంద్రంలో వారికి కరువు పరిస్థితులపై ఫొటోలు, నివేదికలు కూడా ఇచ్చారు. అయితే కేంద్రం నుంచి ఏమీ రాలేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రీత్యా ఇక్కడ నుంచి కూడా పరిహారం రాలేదు. సిఎం చంద్రబాబు జిల్లాకు వచ్చినప్పుడైనా ఎమ్మెల్యేలు ప్రస్తావించలేదు. 100 రోజుల పాలనలో రైతులకు పరిహారం ప్రస్తావన లేకుండా పోయింది. ఈ ఏడాదీ ఖరీఫ్ కూడా ఆశాజనకంగా లేదు. 50 శాతం కూడా సాగు జరగలేదు. ఇప్పుడూ నష్టమే జరిగింది. మరోవైపు సాగర్ రిజర్వాయర్ నిండా నీరున్నా మాగాణికి నీరివ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. ఏదేమైనా రైతులపై దృష్టి సారించాల్సి ఉంది. నష్టపోయిన రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు పరిహారం ఇస్తే రైతులకు పెట్టుబడుల రూపంలో రబీ సాగుకు ఉపయోగపడతాయి.

దావా సమను, ఆర్డర్5 రూల్1 మరియు 5 సి.పి.సి.
మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. 77/2024

వన్నెబోయిన శ్రీను ...... వాది
వర్సెస్
బోదనపు సుబ్బారెడ్డి .... ప్రతివాది

టు,
ప్రతివాది
బోదనపు సుబ్బారెడ్డి, తండ్రి: సుబ్బరాయుడు
వయసు: 55 సం॥, హిందూ, వ్యవసాయం
నివాసం: వై.చెర్లోపల్లి గ్రామం, దోర్నాల మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలోని వాది, దావా పరిహారం అనగా ప్రామిసరి నోటు బాకీ నిమిత్తం పై కోర్టులో పై నెంబరున నీ మీద దావా దాఖలు చేసియున్నాడు. ఇందు విషయమై నీకు పలుమార్లు దావా సమన్లు పంపగా అవి నీకు ముట్టని కారణము చేత, ఈదినపత్రిక సమను ద్వారా నీకు తెలియ జేయునది ఏమనగా తేదీ: 18-10-2024న ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో స్వయముగా గానీ, అడ్వకేట్ గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల నీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 18-10-2024

వి.శ్రీనివాసరావు
అడ్వకేట్, మార్కాపురం.

మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. 320/2023

వెన్నం రామిరెడ్డి ... వాది
వర్సెస్
బొగ్గు లక్ష్మిరెడ్డి (చనిపోయినందున వారసులు)
బొగ్గు నాగమ్మ మరియు ఇతరులు ..... ప్రతివాదులు

టు,
3 ప్రతివాది అడ్రసు
రామిరెడ్డి చైతన్య, భర్త: రామిరెడ్డి వంశి క్రిష్ణారెడ్డి
తండ్రి: లేట్ లక్ష్మిరెడ్డి
నివాసం: బోడపాడు గ్రామం మరియు పోస్టు
మార్కాపురం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావా వాది పైన తెలిపిన ప్రతివాదులపై పైకం వసూలు నిమిత్తం పైన తెలిపిన కోర్టు నందు దావా దాఖలు చేసియున్నారు. ఈ దావా నందు వాది పైన తెలిపిన 3వ ప్రతివాదికి అనేక పర్యాయములు దావా సమన్లు పంపిననూ తీసుకొనక కాలాయాపన చేయుచున్నారు. కావున ఘనమైన కోర్టు వారు 3వ ప్రతివాదికి నోటీసు జారీ నిమిత్తం తేదీ: 04-10-2024న వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా లేదా వకీలు ద్వారా గానీ హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల నీ పరోక్షమందు కేసు విచారించి తీర్మానించబడునని నీకు తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 04-10-2024 ఇట్లు

మధిరె శ్రీరామిరెడ్డి
మధిరె తిమ్మారెడ్డి
అడ్వకేట్స్, మార్కాపురం

మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. 321/2023

ముక్కమల్ల సంజీవరెడ్డి ..... వాది
వర్సెస్
బొగ్గు లక్ష్మిరెడ్డి (చనిపోయినందున వారసులు)
బొగ్గు నాగమ్మ మరియు ఇతరులు ... ప్రతివాదులు

టు,
3 ప్రతివాది అడ్రసు
రామిరెడ్డి చైతన్య, భర్త: రామిరెడ్డి వంశి క్రిష్ణారెడ్డి
తండ్రి: లేట్ లక్ష్మిరెడ్డి, వయసు: 23 సం॥
నివాసం: బోడపాడు గ్రామం మరియు పోస్టు
మార్కాపురం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావా వాది పైన తెలిపిన ప్రతివాదులపై పైకం వసూలు నిమిత్తం పైన తెలిపిన కోర్టు నందు దావా దాఖలు చేసియున్నారు. ఈ దావా నందు వాది పైన తెలిపిన 3వ ప్రతివాదికి అనేక పర్యాయములు దావా సమన్లు పంపిననూ తీసుకొనక కాలాయాపన చేయుచున్నారు. కావున ఘనమైన కోర్టు వారు 3వ ప్రతివాదికి నోటీసు జారీ నిమిత్తం తేదీ: 17-10-2024న వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా లేదా వకీలు ద్వారా గానీ హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల నీ పరోక్షమందు కేసు విచారించి తీర్మానించబడునని నీకు తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 17-10-2024 ఇట్లు

మధిరె శ్రీరామిరెడ్డి
మధిరె తిమ్మారెడ్డి
అడ్వకేట్స్, మార్కాపురం

IN THE COURT OF THE ADDL. JUDICIAL 1st CLASS MAGISTRATE ::MARKPUR
C.C. 372/2014

Thadikamalla Bala Subba Rao, aged about 53 years, S/o Rama Subbaiah, Business,,Hindu, H.No.10/836/A, 10th ward, Markapur, Prakasam District ....Complainant
Vs
Masunuri Babu,,aged about 48 years, S/o.Muneiah, Hindu, Business,,D.No. 7/328, Upstairs on Lakshmi Narasimha Traders,,Cumbum Road, Markapur-523316, Prakasam Dist ....Accused

PROCLAMATION REQUIRING THE ATTENDANCE OF THE ACCUSED U/S.82 Cr.P.C. NOW 84 OF B.N.N.S.

Where as the complainant has been made before me that Masunuri Babu, S/o.Muneiah, R/o. Markapur has committed the offence of dishonor of cheque punishable U/s. 138 of N.I. Act,,and it has been returned to a warrant of arrest there upon issued that the said Masunuri Babu, S/o. Muneiah cannot be found, and where as it has been shown to my satisfaction that the Masunuri Babu, S/o.Muneiah has absconded (or is concealing himself to avoid the service of the said warrant).

Proclamation is hereby made that the said Masunuri Babu, S/o.Muneiah,of Markapur is required to appear at Markapur before the Addl. Judicial 1st Class Magistrate Court to answer the said complainant on 21.10.2024.

B. O
of Addl.Judicial 1st Class Magistrate Court, Markapur

Syed Javeed Anwar
M.Com., M.P.Ed.,LL.M.,
Advocate for Complainant
Markapur, Cell-9440211015

అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No: 2009/2022
I.A.NO: 2010/2022
I.A. NO: 2011/2022
IN
O.S. NO: 103/2014

తిరువీధుల శివపార్వతి ....పిటిషనర్ /వాది
V/s
ముప్వా పున్నమ్మ వగైరాలు
... రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

NOTICE

R8) మారేళ్ళ శేషమ్మ W/o వెంకట్రావు,
మారేళ్ళవారిపాలెం, మద్దిపాడు మండలం,
ప్రకాశం జిల్లా.

పై దావాలో వాది, చనిపోయిన ముప్వా పున్నమ్మ గారికి మిమ్ములను వారసులుగా చేర్చమని కోరుచూ I.A.No : 2011/2022 నెంబరున పిటిషను దాఖలు చేసినది. అదేవిధంగా ముప్వా పున్నమ్మ వున్న ఎబెట్‌మెంట్ ఆర్డర్‌రద్దు చేయమని కోరుచూ I.A.No: 2010/2022 నెంబరున పిటిషను దాఖలు చేసినది. సదరు ఎబెట్ మెంట్ ఆర్డర్ రద్దు చేయమని కోరుటులో జరిగిన ఆలస్యమును క్షమించమని కోరుచూ I.A.No : 2009/2022 పిటిషను దాఖలు చేసినది. సదరు పిటిషన్ లో మీకేమైనా అభ్యంతరములు ఉన్నచో అట్టివి తేది:04-10-2024న ఉదయం 10.30 ని.లకు పై కోర్టు ఎదుట హాజరై తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమందు పిటిషన్లు తీర్మానం కాగలవు.

// శ్రీ కోర్టు వారి అనుమతితో //

ఇట్లు
వెలగపూడి సుబ్రహ్మణ్యం
పిటిషనరు తరపు న్యాయవాది,
అద్దంకి

అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No: 2009/2022
I.A.No: 2010/2022
I. A. No:2011/2022
In
O.S.No: 103/2014

తిరువీధుల శివపార్వతి ...పిటిషనర్ /వాది
V/s
ముప్వా పున్నమ్మ వగైరాలు
..... రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

NOTICE

R3) ముప్వా రాఘవయ్య S/o రామయ్య
రావినూతల (గ్రామం) కొరిశపాడు (మండలం)
R4) ముప్వా చెంచయ్య S/o రామయ్య
రావినూతల (గ్రామం) కొరిశపాడు (మండలం)
R5) శృంగవరపు దేవి W/o సుబ్బారావు
రామ్‌నగర్, అద్దంకి
R6) నాగు బోయిన జయమ్మ W/o వెంకటేశ్వర్లు,
రావినూతల (గ్రామం), కొరిశపాడు (మండలం)
R9) మాగులూరి ఇందిర W/o రాంబాబు
ఆరికట్లవారిపాలెం, జె.పంగులూరు(మండలం)

పై దావాలో వాది, చనిపోయిన ముప్వా పున్నమ్మకు మిమ్ములను వారసులుగా చేర్చమని కోరుచూ I.A.No : 2011/2022 నెంబరున పిటిషను వాది దాఖలు చేసినది. అదేవిధంగా సదరు ముప్వా పున్నమ్మ పైవున్న ఎబెట్ మెంట్ ఆర్డర్ రద్దు చేయమని కోరుచూ I.A.No: 2010/2022 నెంబరున పిటిషను దాఖలు చేసినది. సదరు ఎబెట్ మెంట్ ఆర్డర్ రద్దు చేయమని కోరుటలో జరిగిన ఆలస్యమును క్షమించమని కోరుచూ I.A.No:2009/2022న పిటిషను దాఖలు చేసినది. పై చెప్పిన మూడు పిటిషన్లలో మీనోటీసు నిమిత్తమై తేది:04-10-2024కి వాయిదా వేయబడినవి. కావున మీకు సదురు పిటీషన్లపై ఏమైనా అభ్యంతరములు ఉన్నచో అట్టివి అక్టోబర్ 4వ తేది పై కోర్టు ఎదుట ఉదయం 10.30 ని.లకు హాజరై తెలుపుకొనగలరు. లేనిచో సదరు పిటిషన్లు మీ పరోక్షమందు తీర్మానంకాగలవు.

// శ్రీ కోర్టు వారి అనుమతితో //

ఇట్లు
వెలగపూడి సుబ్రహ్మణ్యం
పిటిషనరు తరపు న్యాయవాది,
అద్దంకి

గ్రామపంచాయతీ - అల్లూరు గ్రామము
కొత్తపట్నం మండలం,ప్రకాశంజిల్లా

RC No: 03/2024 **టెండర్ ప్రకటన** **తేదీ: 22-09-2024**

కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామపంచాయతీ నందు తేది: 01-10-2024 నుండి 30-06-2025 వరకు 9 నెలల కాలమును ఈ దిగువ పనులకు నెలవారి కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించుటకు తేదీ: 27-09-2024 ఉదయం 11.00 గంటలకు సీల్డ్ టెండర్లు స్వీకరించబడును మరియు అదే రోజు సాయంత్రం 3.00 గంటలకు టెండరు దారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. ఆసక్తి కలవారు టెండరు ధరఖాస్తుకు 500/-లు రశీదు జతపరచవలెను. ఏ కారణము చూపకనే టెండర్లు రద్దు చేయుటను మరియు వాయిదా వేయుటకు గ్రామపంచాయతీకి పూర్తి అధికారం కలదు.

వ.నెం	పని వివరములు	వర్తించు కాలము	సంఖ్య	ధరావత్తు
1.	స్వీపర్లు	9 నెలలు	7	500
2.	ఫిట్టర్	01-10-2024 నుండి 30-06-2025 వరకు	1	500
3.	ట్యాంక్ వాచర్	01-10-2024 నుండి 30-06-2025 వరకు	2	500
4.	ట్రాక్టర్ డ్రైవర్	01-10-2024 నుండి 30-06-2025 వరకు	1	500
5.	ఇంజన్ డ్రైవర్	01-10-2024 నుండి 30-06-2025 వరకు	1	500
6.	ఎలక్ట్రీషియన్	01-10-2024 నుండి 30-06-2025 వరకు	1	500

నిబంధనలు : 1) కాంట్రాక్టు 9 నెలల కాలం వరకు 01-10-2024 నుండి 30-06-2025 వరకు అమలులో ఉంటాయి.
2) గ్రామ పంచాయితో నిధుల సౌలభ్యతను బట్టి మాత్రమే వేతనములు చెల్లించబడును.
3) కాంట్రాక్టు రద్దు చేయుటకు గ్రామపంచాయతీకి అధికారము కలదు.
4) కాంట్రాక్టు పని సంతృప్తి లేనియెడల అతని స్థానంలో వేరొకరిని నియమించు అధికారం గ్రామపంచాయతీ వారికి కలదు.
5) పనిచేయు కాలము బట్టి వేతమును నిర్ణయించబడును
6) గ్రామ పంచాయితి బైలా ప్రకారం కార్మికులను తీసుకోబడును.
7) ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయస్సు పరిగణలోకి తీసుకోబడును.

షరతులు వర్తిస్తాయి.

పంచాయతీ కార్యదర్శి
గ్రామపంచాయతీ,అల్లూరు.

సర్పంచి గ్రామపంచాయతీ
గ్రామ పంచాయితీ,అల్లూరు

అన్నా క్యాంటీన్‌కు విరాళం

ప్రజాశక్తి - గిద్దలూరు

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డిని గిద్దలూరు సిమెంట్, ఐరన్ షాప్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి గిద్దలూరు పట్టణంలోని అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ.15 వేల చెక్కు ఎమ్మెల్యేకి అందచేశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో సిమెంట్, ఐరన్ షాప్స్ అసోసియేషన్ సభ్యులు నారాపురం సుబ్బయ్య, వాడకట్టు రామాంజనేయులు, నంది శ్రీను, సూరె మహేష్, అరవింద్, ఆనంద్, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టిజెఆర్‌ని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-మద్దిపాడు

వైసిపి ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే టి.జె.ఆర్. సుధాకర్ బాబుని మండల వైసిపి రైతు విభాగం నాయకులు పల్లకి సత్యనారాయణ రెడ్డి, వైసిపి యువజన నాయకులు రావూరి అశోక్ రెడ్డి కలిశారు. ఆదివారం మల్లవరంలోని వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. వైసిపి ఎస్సీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన టిజేఆర్‌కు వారు శుభాకాంక్షలు తెలిపారు.

సీనియర్ జర్నలిస్టుకు సన్మానం

ప్రజాశక్తి-కొత్తపట్నం

పత్రికా రంగంలో సుదీర్ కాలంగా జర్నలిస్టుగా పనిచేసిన కొత్తపట్నం గ్రామానికి చెందిన కోడూరు వెంకటేశ్వర్ రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఆదివారం జిల్లా కేంద్రమైన ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్ లో ఆప్తా డెమొక్రటిక్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయనను సత్కరించడం జరిగింది. పత్రిక రంగంతో పాటు ఉపాధ్యాయ వృత్తిలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడుగా ప్రైవేట్ పాఠశాలలో సుదీర్ఘ అనుభవం ప్రదర్శించి ఎంతోమంది విద్యార్థుల జీవితాలను ఉన్నత శిఖరాలలో ఉండే విధంగా తీర్చిదిద్ది నందుకు ఆయనను సన్మానించడం జరిగిందని ఆప్తా డెమోక్రటిక్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కే హరిబాబు తెలిపారు. కోడూరి వెంకటేశ్వర్ రెడ్డి తో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులను కూడా సన్మానించి సత్కరించారు.

శ్రీవేణికి ప్రతిభ పురస్కారం

ప్రజాశక్తి-కొండపి

శాలివాహన విశిష్ట రాష్ట్ర ప్రతిభ పురస్కారానికి కొండపి మండలంలోని దేవిరెడ్డిపాలెం పాఠశాలలో సెకండరీ గ్రేడు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఉప్పుటూరి శ్రీవేణి ఎంపికైంది. ఈ అవార్డు హైదరాబాదుకి చెందిన శాలివాహన చారిటబుల్ ట్రస్టు వారు ఈనెల 22వ తేదీ ఆదివారం హైదరాబాదులోని బాగ్‌లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞాన భవన్ కేంద్రంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారం అందించనున్నారు.

జూడో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి మండలం కామేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు బి. అభిషేక్, ఎం.కార్తీక్, కె.బాలచరన్, ఎం.పాల్ రాజ్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు నర్రా కోటేశ్వరరావు తెలిపారు. వీరు అక్టోబరులో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని హెచ్ఎం ఎల్.అనూరాధ తెలి పారు.

మోడల్ స్కూల్స్‌కు సర్వీస్ రూల్స్ విడుదల చేయాలి

ప్రజాశక్తి-దర్శి

ఏపీ ఎంఎస్ ఎస్‌టియు జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా గౌరవ అధ్యక్షులు కె.పూర్ణచంద్రరావు అధ్యక్షతన దర్శి మోడల్‌స్కూల్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీ ఎంఎస్ ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పి.మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మునిరత్నం, రమేష్‌బాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు హరి, జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, ఆదర్శ పాఠశాలలకు సంబంధించిన సర్వీస్ రూల్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రకాశం జిల్లా ఏపీఎంఎస్ ఎస్‌టియు జిల్లా అధ్యక్షులుగా పసుపులేటి వెంకటేశ్వర్లు, జిల్లా జనరల్ సెక్రెటరీగా కె.ఏడుకొండలు, జిల్లా ట్రెజరర్‌గా ఎ.పాండురంగస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కె.ఎర్రయ్య వ్యవహరించారు.

దర్శి అభివృద్ధికి కృషి చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఆంజనేయులు

మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-దర్శి

దర్శి నియోజకవర్గంలో అధికార, ప్రతిపక్ష పార్టీలైన తెలుగుదేశం, వైసిపి పార్టీలు గొడవలు పడటం మాని నిధులు తెచ్చి అభివృద్ధికి కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు అన్నారు. ఆదివారం దర్శి సుందరయ్య భవనంలో చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల దర్శి ఉద్రిక్తంగా మారిందని, ప్రజల మధ్య ఘర్షణ వాతావరణం పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. దర్శి ప్రాంతంలో 35 వేల ఎకరాలలో వరిపంట సాగు జరుగుతుందని, సాగర్ పూర్తిగా నిండిపోయి సముద్రం పాలౌతున్నా ప్రభుత్వం ఇప్పటికి కూడా అధికారికంగా ప్రకాశం జిల్లాకి వరిపంటకు పూర్తి స్థాయిలో సాగునీరు ఇస్తామని ప్రకటించక పోవడం అన్యాయం అని ఆవేదన వ్యక్తం చేశారు. దర్శి నియోజక వర్గ కార్యదర్శి తాండవ రంగారావు మాట్లాడుతూ దర్శిని అభివృద్ధి చేసే వారికి సిపిఎం సహకారం ఉంటుందన్నారు. సిపిఎం శాఖ మహాసభలు గ్రామ స్థాయిలో పెద్దఎత్తున నియోజక వర్గంలో జరపాలని ఈ సమావేశం తీర్మానం చేసింది. సిపిఎం దొనకొండ, కురిచేడు, దర్శి, ముళ్ళమూరు నాయకులు ఉప్పు నారాయణ, కెవి.పిచ్చయ్య, కుందుర్తి అనిల్, ఆంజనేయులు, ఈమని నాగేశ్వరరావు, కర్నా హనుమయ్య, కాలే భాషా పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మార్కాపురం

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం స్థానిక శుభం కళ్యాణ మండపంలో జరిగింది. సంస్థ అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కన్వీనర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి అతిథిగా విచ్చేశారు. మార్కాపురం యూనిట్ అధ్యక్షులుగా వెలిశెట్టి చలమయ్య, ఉపాధ్యక్షులుగా సీహెచ్ సుబ్బారావు, కార్యదర్శిగా గుంటక చెన్నారెడ్డి, సహాయ కార్యదర్శిగా రావిక్రింది కిరణ్, అవేర్నెస్ సెక్రటరీగా కొణిజేటి రమేష్, విద్యా కార్యదర్శిగా నారాయణం లావణ్య, హెల్త్ అండ్ మెడికల్ సెక్రటరీగా కంచర్ల చెన్న కృష్ణగౌడ్, ఎమర్జెన్సీ సర్వీసెస్ సెక్రటరీగా నటుకుల వెంకట కృష్ణ, కోశాధికారిగా గంగిశెట్టి కిరణ్‌లు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గుంటక చెన్నారెడ్డి, ఉపాధ్యక్షులు ఆర్.కె.జె.నరసింహ పాల్గొన్నారు.

వ్యాధులపై ఆర్ఎంపిలకు అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని వినుకొండ రోడ్డులో గల వైష్ణవి గార్డెన్స్ నందు పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన సుప్రీత ఆర్థో అండ్ ట్రామా కేర్ హాస్పటల్ అధినేత, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల ఆర్ఎంపీలకు ఆదివారం ఎముకలు, నరముల వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం గౌరవాధ్యక్షులు షేక్ వలీసాహెబ్, అధ్యక్షులు పల్లెపోగు జాషువ, కోశాధికారి పఠాన్ ఇస్మాయిల్ ఖాన్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూనియన్ జిల్లా కార్యదర్శి పి.కల్పన కోరారు. స్థానిక వడ్డె పాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికుల, పాఠశాల స్వీపర్స్ ఉమ్మడి సమావేశం ఎస్.తిరుపతి రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి పి.కల్పన మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలన్నారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగమ్మ, తిరుమలమ్మ కార్మికులు పాల్గొన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 23 తేదీన ఎంఆర్‌సి కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు యూనియన్ నాయకులు తిరుమలమ్మ నాగమ్మ తెలిపారు.

వరద బాధితులకు విరాళం అందజేత

ప్రజాశక్తి - గిద్దలూరు

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డిని అర్థవీడు మండల ఫర్టిలైజర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం తమ వంతు సహాకారంగా రూ.50 వేల చెక్కు అందచేశారు. ఈ సందర్భంగా చెక్కు అందజేసిన ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ సభ్యులను ఎమ్మెల్యే అశోక్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్స్ అసోసియేషన్ సభ్యులు ఎం.మల్లికార్జునరావు, బంకు రంగయ్య, లాకా రమణ, షేక్ అబ్దుల్, వెంకటేశ్వర్లు, సుభాని, మాకా వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ తీర్పును పున:పరిశీలించాలి

మాల మహాసభ అధ్యక్షులు వెంకట్రావు

మాట్లాడుతున్న మాల మహాసభ అధ్యక్షుడు వెంకట్రావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, క్రిమిలేయర్ తీర్పును పున: పరిశీలించాలని, ఈ తీర్పును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ వేయాలని మాలమహాసభ అధ్యక్షులు మల్లెల వెంకట్రావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని అంబేద్కర్ ఆడిటోరియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వర్గీకరణ, క్రిమిలేయర్ వ్యతిరేక సభలో ఆయన ప్రసంగించారు. తొలుత డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూలులో సభ జరుగుతున్న సమయంలో వర్షం రావటంతో వేదికను అంబేద్కర్ భవన్‌కు మార్చారు. తరువాత జరిగిన సభకు దళిత సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార తెలుగుదేశం పార్టీలోని మాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, చంద్రబాబుకు వివరించి ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను ఆపి.. మాలల సత్తా చూపించాలన్నారు. డిసెంబర్ 14న గుంటూరులో నిర్వహించ తలపెట్టిన మాలల రణ గర్జనలో లక్షలాదిగా పాల్గొని మాలల ఐక్యతను చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఉర్దూ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జివి రత్నాకర్ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ఎంతో చారిత్రకమైనదని, అంబేద్కరిజం బౌద్ధం ద్వారా వచ్చిన ఫిలాసఫీని అందిపుచ్చుకున్న మాలలు 9 రాష్ట్రాల్లో గణనీయమైన సంఖ్యలో ఉన్నారన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా అంబేద్కర్ కల్పించిన హక్కులని కాపాడుకోవడంలో ప్రాణత్యాగానికైనా సిద్ధ పడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు అధ్యక్షుడు దాసరి శివాజీ, జై భీం పీపుల్స్ పార్టీ అంబటి కొండల రాయుడు, మాల ఉద్యోగుల సంఘం నాయకులు టి.అశోక్, గోపి, దళిత పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు, జనం పార్టీ నేత చప్పిడి రవి శంకర్ పాల్గొన్నారు.

పది పొట్టేళ్లు చోరీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని శ్రీశైలం రోడ్డులో గల అయ్యప్పస్వామి గుడి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున పది పొట్టేళ్లు చోరీకి గురయ్యాయి. గుమ్మా యల్లయ్య, ఖాశింపాలకు చెందిన పొట్టేళ్లకు ఒక మనిషిని కాపలాగా పెట్టి ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు రెండు వాహనాల్లో వచ్చి పది పొట్టే ళ్లను తీసుకెళ్లినట్లు ఎదురుగా గల సీసీ కెమెరాల్లో రికార్డు అయి ఉంది. యజమానుల ఫిర్యాదు మేరకు ఎస్సై మహేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. చోరీకి గురైన పొట్టేళ్ల రూ.లక్ష విలువ ఉంటాయని బాధితులు వాపోయారు.

కొండ చిలువ కలకలం

ప్రజాశక్తి మార్కాపురం

కొండచిలువను పట్టుకున్న నిరంజన్

మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో గల వాటర్ ట్యాంక్ వద్ద ఏడు అడుగుల పొడవు గల కొండ చిలువ సంచరిస్తుండటాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో స్నేక్ క్యాచర్ నిరంజన్ సంఘటన స్థలానికి చేరుకొని కొండచిలువను పట్టుకున్నారు. కొండ చిలువను అడవుల్లో వదిలిపెట్టనున్నట్లు నిరంజన్ తెలిపారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-పామూరు

పేకాట స్థావరాలపై దాడులు చేసి 9 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై అశోక్ బాబు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామం పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1,13,560 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఎస్ఐకి సన్మానం

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు నాయక్‌ను ఆదివారం ఆర్యవైశ్య ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు, ఆర్యవైశ్య సంఘం జిల్లా కౌన్సిలర్ తుమ్మలపెంట వెంకటరమణ, మండల అధ్యక్షులు సముద్రాల వెంకటేశ్వర్లు, యువజన సంఘం అధ్యక్షులు తుమ్మలపెంట రామ్ నారాయణ, కోశాధికారి ప్రవీణ్, రమేష్ పాల్గొన్నారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.యస్. నారాయణరెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కొమరోలు ఎస్ఐ ఎం.వెంకటేశ్వర నాయక్‌ను ఘనంగా సత్కరించారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్స్ కలగొట్ల పెద్ద గురవయ్య శుభాకాంక్షలు తెలిపారు.

సిఐని కలిసిన టీడీపీ నాయకులు

పెద్ద దోర్నాల: యర్రగొండపాలెం సిఐ ప్రభాకర్‌ను పెద్దదోర్నాల టీడీపీ నాయకులు ఆదివారం యర్రగొండపాలెంలోని సిఐ కార్యాలయంలో కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎరువ మల్లికార్జునరెడ్డి, జనసేన మండల కన్వీనర్ మురళి, టీడీపీ సీనియర్ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన షీప్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు

సిఎస్‌పురం రూరల్: ఎస్ఐ ఆర్.సుమన్‌ను మండలంలోని చెన్నపునాయుని పల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు, షీప్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు తోడేటి గోపి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. టిడిపి నాయకులు బొబ్బూరి రమేష్ కూడా ఎస్సై సుమన్‌ను కలిసి సన్మానించారు.

ఎస్ఐని కలిసిన నాయకులు

హనుమంతునిపాడు: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హనుమంతుని పాడు ఎస్ఐ మాధవరావుని మాజీ మండల పార్టీ అధ్యక్షులు క్లస్టర్ ఇంచార్జి గాయం తిరుపతి రెడ్డి, దొడ్డి చింతల సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి, మల్లెల వెంకటరెడ్డి, కోటపాటి శేషయ్య, గంగిరెడ్డి రమేష్ రెడ్డి, కుందురు నారాయణరెడ్డి, వేశపోగు ఎర్రయ్య తదితరులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నిబద్ధత గల కార్యకర్త హరిప్రసాద్

ఉద్యోగ విరమణ సభలో ఎంఎల్‌సి లక్ష్మణరావు

సభలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - చీరాల

గత 38ఏళ్లుగా బీసీ సంక్షేమ శాఖలో వసతి గృహ సంక్షేమ అధికారిగా వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించి గత నెల 31న ఉద్యోగ విరమణ పొందిన బండారు హరిప్రసాద్ వృత్తిపట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి అని ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో హరిప్రసాద్ ఉద్యోగ విరమణ అభినందన సభ ఆదివారం జెవివి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ హరిప్రసాద్ విద్యార్థి దశ నుండి ఉద్యమాల్లో ఉంటూ ఉద్యోగం పొందినప్పటికీ వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేశారని అన్నారు. వృత్తిపరంగా వస్తున్న అనేక రకాల సమస్యలపైన పోరాటం నడిపారని అన్నారు. ఎన్జీఒ నాయకునిగా, బీసీ సంక్షేమ శాఖ ఉద్యోగుల సంఘం నాయకునిగా, ఇతర ఉద్యోగ, కార్మిక సంఘాలకు నాయకత్వం వహిస్తూ అనేక పోరాటాలు నిర్వహించారని అన్నారు. తను ఎక్కడ పని చేసిన తమ విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దటంలో మంచి గుర్తింపు సాధించారని అన్నారు. అందువల్లనే తన సర్వీసులో ఆరు సార్లు ఉత్తమ అధికారిగా అవార్డు పొందారని అన్నారు. హరిప్రసాద్ శేష జీవితం సుఖ సంతోషాలతో గడపాలని కోరారు. అనంతరం హరిప్రసాద్, కుసుమ కుమారి దంపతులను ఘనంగా సన్మానించారు. సభకు జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా రామరావు అధ్యక్షత వహించారు. సభలో చినగంజాం తహశీల్దారు జీవిగుంట ప్రభాకరరావు, యుటిఎఫ్ నాయకులు బండి భిక్షాలుబాబు, గౌరాబత్తిన సూరిబాబు, సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్ గంగయ్య, ఎన్ బాబూరావు, సిహెచ్ సురేష్, సిహెచ్ శేషుబాబు, కె వీరాంజనేయులు, వెలుగొండారెడ్డి పాల్గొన్నారు.

పిడి ఆళ్ల సుందరరామిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పీడీ సుందరరామిరెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి - చీరాల

వ్యాయామ ఉపాధ్యాయులు సుందరరామిరెడ్డి హాకీ క్రీడకు చేసిన సేవలు ఎనలేనివని ఆంధ్రప్రదేశ్ హాకీ ఫెడరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం నిరంజన్‌రెడ్డి అన్నారు. స్థానిక గోలి సదాశివరావు కళ్యాణ మంటపంలో ఆదివారం జరిగిన ఆళ్ల సుందర రామిరెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన సభలో ఆయన మాట్లాడారు. పూర్వపు ప్రకాశం జిల్లాలో హాకీ క్రీడలో జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసిన ఘనత సుందరరామిరెడ్డిదేనని అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు వై శీనయ్య మాట్లాడుతూ వేసవి హాకీ శిక్షణా శిబిరాలు నిర్వహించడంలో విశేష కృషి చేశారని అన్నారు. 34ఏళ్లుగా వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేసి చీరాల ప్రాంతంలో మంచి పేరు పొందారని అన్నారు. సుందరరామిరెడ్డి, పద్మావతి దంపతులను వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది, పూర్వ విద్యార్థులు, మిత్రులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుందరరామిరెడ్డి శిష్యులు, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తాడివలస దేవరాజు, వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్, కుర్రా రామారావు, వెలుగొండరెడ్డి, వీరాంజనేయులు, ఏడుకొండలు, పవని భాను చంద్రమూర్తి, ప్రకాష్, ధన, గోల్డి పాల్గొన్నారు.

స్మశానంలో స్నాన వాటికను ప్రారంభిస్తున్న బిఎస్ఆర్

అద్దేపల్లి మహాప్రస్థానంలో స్నాన వాటిక ఏర్పాటు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రమైన భట్టిప్రోలు పంచాయితీ అద్దేపల్లి గ్రామంలో మహాప్రస్థానం (స్మశానం)లో నూతనంగా నిర్మించిన స్నాన వాటికను ఆదివారం ప్రారంభించారు. కుందేటి లక్ష్మీనారాయణ ధర్మపత్ని శ్యామలాంబ జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీరాములు ధర్మపత్ని అంకమ్మ ఆర్థిక సహకారంతో స్నానవాటికను నిర్మింప చేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి హిందువులు అందరూ సహకరించాలని కోరారు. స్నానవాటికి నిర్మాణానికి రూ.1.25లక్షలు ఖర్చయిందని, ఇంకా దాతలు ముందుకు వచ్చినట్లయితే మిగిలిన అభివృద్ధి పూర్తి చేయడానికి వీలవుతుందని తెలిపారు. దహన వాటిక నిర్మాణ దాత బొలిశెట్టి శ్రీనివాసరావు, కుందేటి శ్రీనివాస రావు, కుందేటి రమేష్, మద్దుల చంద్ర కిషోర్, కుందేటి శ్రీమన్నారాయణ, పసుపులేటి శివప్రసాద్ పాల్గొన్నారు.

25న కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎన్‌డిఏ భాగస్వామ్య పక్షం 100 రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి 'సూపర్ సిక్స్ పథకాలను' అమలు పరచకుండా కాలయాపన చేయటాన్ని నిరసిస్తూ ఈనెల 25న ఒంగోలు కలెక్టరేట్ ఎదుట 'తాళిబజావ్' పేరిట నిరసన చేపడుతున్నట్లు డిసిసి అధ్యక్షులు షేక్ సైదా తెలిపారు. నిద్రావస్థలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని మేల్కొపేందుకు నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని 8 అసెంబ్లీల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. 2024 శాసనసభ, పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ తరపున అభ్యర్థులుగా పోటీ చేసిన వారు ప్రధాన భాద్యత తీసుకొని కార్యకర్తలను తరలించాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా వందరోజుల పాలన

ఇది మంచి ప్రభుత్వం సభలో ఎంఎల్‌ఎలు ఆనందబాబు, కొండయ్య

మాట్లాడుతున్న శాసన సభ్యులు నక్క ఆనందబాబు

సభలో మాట్లాడుతున్న చీరాల ఎంఎల్‌ఎ కొండయ్య

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని చావలి గ్రామంలో ఆదివారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' సభలో శాసన సభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి వందరోజుల కూటమి ప్రభుత్వ పాలనపై ముద్రించిన కరపత్రాలను అంటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ప్రజల మన్ననలు పొందిందని చెప్పారు. గ్రామంలో ఆయన ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రానున్న రోజుల్లో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీల అమలుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చీరాల : రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఎ కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తుందని ఎంఎల్‌ఎ మద్దులూరు మాలకొండయ్య అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఈపురుపాలెంలో ఆదివారం నిర్వహించారు. 100 రోజుల పాలనలో సీఎం చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలతో ప్రజల చేత 'ఇది మంచి ప్రభుత్వం' అని అనిపించుకుంటున్నట్లు చెప్పారు. వృద్ధాప్య పెన్షన్ రూ4వేలు, వికలాంగుల పెన్షన్ రూ.6వేలు, లక్షలాది మంది పేదల ఆకలి తీర్చే 'అన్న క్యాంటీన్లు', యువత భవిష్యత్తుకు 'మెగాడీఎస్సీ', ప్రజల ఆస్తుల భద్రతకు 'ల్యాండ్ టైటిలింగ్ యాక్టు' రద్దు, వరద బాధితులను ఆదుకోవడం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

ముండ్లమూరు : దర్శి నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని, సాగు, తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని టిడిపి ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మండలంలోని కేల్లంపల్లి గ్రామంలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామానికి విచ్చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మాజీ శాసన సభ్యులు నారపుశెట్టి పాపారావుకు మహిళలు పూలతో ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలోని ఇంటింటికి తిరిగి వంద రోజుల్లో ప్రభుత్వం ప్రజలకోసం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కేల్లంపల్లి పంచాయతీలోని ఏడు గ్రామాలకు మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని మహిళలు తను దృష్టికి తీసుకు వచ్చారని, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడి 2 రోజుల్లో మంచినీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ప్రధానమంత్రి మోడీ సహకారంతో రాష్ట్రంలో ఖాళీ ఖజానా ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. దర్శి నియోజకవర్గంలోని ప్రతి మండలానికి రూ.3కోట్ల చొప్పున అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని అన్నారు. ఇటీవల దర్శిలో జరిగిన మెగా జాబ్ మేళాలో 1700 మంది నిరుద్యోగుల హాజరుగాక వారిలో 587 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. దర్శిలో అన్నా క్యాంటీన్ మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు కోరగా మంజూరు చేశారని తెలిపారు. ప్రతి మండలంలో అక్టోబర్ నెలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఈదర అష్ట పద్మాలమ్మ తల్లి దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఎంపిడిఒ అర్ జనార్ధన్, పిఆర్ ఎఇఎం వెంకటేశ్వర్లు, ఈఓఆర్డి శ్రీదేవి, టిడిపి అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, మాజీ జడ్పిటిసిలు వరగాని పౌలు, కొక్కెర నాగరాజు, మాజీ సర్పంచ్ నిడమానూరు శ్రీను, ఎంపీటీసీ యోగేశ్వరమ్మ, మాజీ సర్పంచులు జిల్లెల్ల మోడీ చౌదరి, వేముల సర్పంచ్ గజ్జల సుబ్బారెడ్డి, వేములకొండ సర్పంచ్ ప్రసాదు, టిడిపి నాయకులు కట్ట వెంకంబొల్లు, చావా బ్రహ్మయ్య, దేవత వరప్రసాద్, కాటూరి గురవయ్య, ఎం నాగేశ్వరరావు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ లక్ష్మి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

'పొలం పిలుస్తోంది' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అద్దంకి

రైతుల క్షేత్ర స్థాయి సమస్యలు తక్షణమే పరిష్కరించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేకూర్చడమే లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిసామని తెలిపారు. వ్యవసాయం, అనుబంధశాఖలైన పశు సంవర్ధక, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు కలిసి పంట పొలాలను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం గ్రామ సభ నిర్వహించి రైతుల సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం ఒక గంట వరకు ఒక గ్రామం, మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు మరో గ్రామంలో నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అద్దంకి, మార్టూరు ఎడిఎలు కె ధనరాజ్, శ్రీనివాసరావు, ఎఒలు కొర్రపాటి వెంకటకృష్ణ, సుబ్బారెడ్డి, శ్రీనివాసరావు, ఎస్‌విపి కుమారి పాల్గొన్నారు.

రిసార్ట్స్‌లో ఆకస్మికంగా సోదాలు చేస్తున్న పోలీసులు

అసాంఘిక పనులకు చోటు కల్పిస్తే కఠిన చర్యలు

ఆకస్మిక తనిఖీ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు, నేరస్థులను గుర్తించేందుకు, అక్రమ మద్యం విక్రయాలను నిరోధించేందుకు జిల్లాలోని రెస్టారెంట్లు, డాబాలు, హెూటల్లు, లాడ్జిలు, రిసార్టుల్లో పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాలతో పోలీసు అధికారులు వారి పరిధిలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను గుర్తించి అడ్డుకట్ట వేసే ఉద్దేశంతో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించి వారి గుర్తింపు పత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ రిసార్ట్స్, ఫ్యామిలీ రెస్టారెంట్లు, డాబాలు, హెూటళ్ళు నిర్వాహకులు అక్రమంగా మద్యం నిల్వ చేసిన, విక్రయించిన, మద్యం సేవించడానికి అవకాశం కల్పించిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా నిర్వహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బస చేసే వారి పూర్తి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. వారు ఏ కారణంచేత వచ్చి ఉంటున్నారు? ఎన్ని రోజులు ఉంటారు? ఎక్కడి నుండి వచ్చారనే వివరాలు తెలుసుకొని గుర్తింపు పత్రాలు పరిశీలించాలని అన్నారు. బస చేసిన వారి కదలికలపై అనుమానం తలెత్తిన, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకునే అవకాశం ఉన్నా సంబంధిత పోలీస్ అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచిం చారు. అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు. శాంతి భద్రతలు కాపాడేందుకు సహకరించాలని కోరారు. తనిఖీలు నిర్వహించే సమ యంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే ఉగ్రకు విరాళం అందజేస్తున్న దాతలు

వైద్యశాల అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-వెలిగండ్ల

కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి వెలిగండ్ల మండలం కెపి అగ్రహారం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు యేరువ చెంచిరెడ్డి, గన్నవరం గ్రామానికి చెందిన కీర్తిశేషులు రావి అంబయ్య చౌదరి కుమారుడు రావి శ్రీనివాసులు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డికి ఒక్కొక్కరు రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు శ్యామల కాశిరెడ్డి, రాష్ట్ర టిడిపి కార్యదర్శి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, అద్దంకి నారాయణ, యేరువ రాజశేఖర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న నల్లూరి రాంబాబు

సీఎం సహాయనిధికి విరాళం

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలం చిన్నవెంకన్నపాలెం గ్రామానికి చెందిన నల్లూరి రాంబాబు సీఎం రిలీఫ్ ఫండ్ కు రూ.50వేలు చెక్కును రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి వర్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, యంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, దామచర్ల సత్య, కొండపి మండల తేదేపా నాయకులు పాల్గొన్నారు.

25న చెకుముకి టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-పీసీపల్లి

ఈనెల 25వ తేదీన పాఠశాల స్థాయి చెకుముకు టాలెంట్ టెస్టు నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక పీసీపల్లి మండల శాఖ అధ్యక్షులు ఎస్.కె.పీ.ఎం గౌస్ ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో 8, 9, 10 తరగతి విద్యార్థులు ఈ టాలెంట్ టెస్టు రాయాలన్నారు. పీసీపల్లి మండలంలోని ఆరు హైస్కూళ్లలో, ఒక కేజీబీవీలో టాలెంట్ టెస్టులు జరుగుతాయన్నారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర, టిడిపి నాయకులు

నేడు వెలిగండ్లకు మంత్రి గొట్టిపాటి రాక

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్లలోని పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరవుతారని నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు శ్యామల కాశిరెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డిలు తెలిపారు. మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

'ఇది మంచి ప్రభుత్వం'లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-సిఎస్ పురం

ప్రజల సమస్యలను తెలుసుకుని గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. మండలంలోని రేగులచెలుకలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం ఎంపీడీవో రామచంద్రరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచాయతీలో నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్ బత్తుల కృష్ణకుమారి, రమణయ్య పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బొమ్మనబోయిన వెంగయ్య, ఏ.కొత్తపల్లి, సిఎస్.పురం, సర్పంచులు ముప్పాళ్ళ శ్యామలమ్మ, శ్రీరాం పద్మావతి, నాయకులు నాగిశెట్టి చిన్నమాలకొండయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, గొర్రెల సహకార సంఘం జిల్లా అధ్యక్షులు తోడేటి గోపి, యేర్వ శ్రీనివాసులు, బోయిళ్ళ నారాయణరెడ్డి, జనసేన నాయకులు వరికూటి నాగరాజు, బొబ్బూరి రమేష్, దర్శిగుంట్ల ఆదినారాయణ, షేక్.రజ్జబ్‌భాష, జానపాటి రాజా, తహశీల్దార్ మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

దామచర్ల ఆంజనేయులుకు ఘన నివాళి

ప్రజాశక్తి-జరుగుమల్లి

స్వర్గీయ మాజీమంత్రి దామచర్ల ఆంజనేయులు 17వ వర్ధంతిని జరుగుమల్లి మండలం కామేపల్లి బస్‌స్టాండ్‌లో నిర్వహించారు. ఎన్‌టిఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి మండల టిడిపి అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, మాజీ ఎంపిపి పేముల విజయ నిర్మల, కామేపల్లి మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు, రావి నాగేశ్వరరావు, పోటు శ్రీనివాస మురళి, తెలుగు రైతు నాయకులు దగ్గుమాటి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

దామచర్ల ఆంజనేయులుకు నివాళులర్పిస్తున్న నాయకులు

శింగరాయకొండ: మాజీమంత్రి దివంగత దామచర్ల ఆంజనేయులు 17వ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. కందుకూరు రోడ్డు వద్ద నందమూరి తారక రామారావు, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వేల్పుల సింగయ్య, చీమకుర్తి కృష్ణ, కూనపరెడ్డి వెంకట సుబ్బారావు, మించల బ్రహ్మయ్య, షేక్ సంధాని భాష, ఇమ్మడిశెట్టి రామారావు, పామర్తి మాధవరావు, సుదర్శి ప్రసాదరావు, సన్నెబోయిన మాలకొండయ్య, ఒలేటి రవిశంకర్ రెడ్డి, మేకల అంకమ్మరావు, సాదం బ్రహ్మయ్య, బాయిరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-చీమకుర్తి

క్వారీలలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలనీ, వేతనాలు పెంచి అగ్రిమెంట్లు అమలు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనంలో జరిగిన గ్రానైట్ కార్మికుల శాఖ మహాసభ, రామ్‌నగర్ శాఖా సమావేశాలకు పులి ఓబులరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు, మండల నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, క్రిష్టిపాటి చిన్నపురెడ్డి, బొజ్జా వీరాంజనేయులు మాట్లాడారు. ఈ సందర్భంగా రామ్‌నగర్ శాఖా కార్యదర్శిగా సిహెచ్ కొండయ్య, గ్రానైట్ వర్కర్స్‌శాఖా కార్యదర్శిగా బి ఓబులేషు ఎన్నికయ్యారు. మహాసభకు ముందుగా సిపిఎం జెండా ఆవిష్కరించారు. సీతారామ్ ఏచూరి తదితర విప్లవ వీరులకు నివాళులు అర్పించారు. మహాసభలో శాఖాసభ్యులు ఎం.లక్ష్మీ నారాయణ, టి.శ్రీను, శంకర్, కనకరాజు, ఎం.పాండు, డి.వాలేశ్వరరావు, కె.వెంకటేశ్వర్లు, బి.ఆంజనేయులు, సాయి, దేవరాజు, ఇ.కరుణాకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-మార్కాపురం

గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం మార్కాపురం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బుక్కె శ్రీనివాస్ నాయక్ తెలిపారు. అఖిల భారత గిరిజ ఉద్యోగుల సంఘం మార్కాపురం నియోజకవర్గ నూతన కమిటీ ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా ఇట్లా రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా బుక్కె శ్రీనివాస నాయక్, కోశాధికారిగా ఎం.శ్రీనివాస నాయక్, ఉపాధ్యక్షులుగా ఎం.మహేష్ నాయక్, ఎస్ ప్రసాద్, సహాయ కార్యదర్శిగా ఎం.వీరాంజి నాయక్, కె.రాజా నాయక్, ఏరియా కన్వీనర్‌గా జె.నాగయ్యలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ఎంపికలో రాష్ట్ర నాయకులు డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ బి.లక్ష్మానాయక్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ జి.ధర్మా నాయక్ పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం నియోజకవర్గ గిరిజన ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులుగా మంత్రనాయక్, కన్వీనర్‌గా మల్లు నాయక్, అధ్యక్షులుగా ఏషా నాయక్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారి దీప్లా నాయక్, వైస్ ప్రెసిడెంట్స్ హర్యానాయక్ శేఖర్ నాయక్, జాయింట్ సెక్రెటరీ పణిరాజ్ నాయక్, రామవత్ మంత్రు నాయక్, బాణావత్ రాంబాబు నాయక్ హనుమా నాయక్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నూతనంగా ఎన్నికైన ఉద్యోగుల కమిటీ

ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

తాగునీటి కోసం మహిళల ధర్నా

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలోని ఐనముక్కల ఎస్సీ పాలెంలో గల డీప్‌బోర్లలో మోటార్లు బిగించకపోవడం, కనీసం ట్యాంకర్ల ద్వారానైనా నీటిని సరఫరా చేయకపోవడంతో ఆ కాలనీ వాసులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించకపోవడంతో గత్యంతరం లేక ఎస్సీపాలెం మహిళలంతా ఖాళీ బిందెలతో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై వాహనాలకు ముళ్లకంప అడ్డంగా వేసి నిరసన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు. దీంతో జాతీయ రహదారికి ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న పెద్దదోర్నాల ఎస్సై మహేష్ హుటాహుటిన తన సిబ్బందితో చేరుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మహిళలకు హామీ ఇచ్చారు. దీంతో ధర్నాను విరమించారు.

చెక్కు అందజేస్తున్న రామా చైతన్య టీం సభ్యులు

సిఎం సహాయనిధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-టంగుటూరు

కొణిజేడు గ్రామం తెలుగు యువత ఆధ్వర్యంలో అమెరికాలో ఉన్న రామా చైతన్య అండ్ టీం సిఎం సహాయనిధికి రూ.లక్ష విరాళాన్ని మంత్రి స్వామికి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి, కొణిజేడు టిడిపి నాయకులు దావులూరి వేణుగోపాల్, రామా నరేంద్రబాబు, పరిటాల బాలకోటయ్య, గొట్టిపాటి వెంకట్రావు, వేమూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డాక్టర్ అంకమ్మరావును సన్మానిస్తున్న దృశ్యం

డాక్టర్ అంకమ్మరావుకు పురస్కారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, కవి, ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావుకు 'శ్రీ పడవల లక్ష్మణస్వామి స్మారక స్ఫూర్తి పురస్కారం-2024'ను ప్రముఖుల చేతులమీదుగా ఆదివారం ప్రదానం చేశారు. 'సహజ సాహితి' సాహిత్య, సాంస్కృతిక సేవాసంస్థ అధ్యక్షులు వడలి రాధాకృష్ణ ఆధ్వర్యంలో చీరాలలోని లయన్ కాకరపర్తి వెంకటేశ్వర్లు సభా ప్రాంగణంలో రోటరీ క్లబ్ సమావేశ మందిరంలో కోడూరి ఏకాంబరేశ్వర బాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకమ్మరావు చేస్తున్న సాహిత్య కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బండారుపల్లి హేమంత్‌కుమార్, పోలుదాసు రామకష్ణ, అంగలకుదిటి నాగవీరభద్రాచారి పాల్గొన్నారు.

ప్రజాసంకల్పంతోనే ఉచిత కంటి వైద్య శిబిరాలు

ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - పర్చూరు

ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే ఉచిత కంటి వైద్య శిబిరాలు రాజకీయాలకు అతీతంగా కొనసాగిస్తున్నట్లు ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. స్థానిక వైఆర్ హైస్కూల్లో నోవా అగ్రి గ్రూప్స్, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఒక యజ్ఞంలా పవిత్ర ఆశయంతో రాజకీయాలు, కుల, మతాలకు అతీతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో గత ఐదేళ్ల దుర్మార్గపు పాలన కొనసాగిందని ఆరోపించారు. కనీసం పేద ప్రజల ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలకు సైతం ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని అన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరాలను సైతం రాజకీయం చేశారని మండిపడ్డారు. క్యాంపుల ద్వారా తనకేదో మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతో కుట్రలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. గత 15 ఏళ్లుగా 200కుపైగా ఉచిత వైద్య శిభిరాలు నిర్వహించి అనేక మందికి కంటి చూపు కల్పించామని అన్నారు. గత ప్రభుత్వంలో పాలన గాడి తప్పడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని

వైద్యశిభిరం పరిశీలిస్తున్న ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రణాళికాబద్ధంగా ఎరువులు, సాగునీరు అందిస్తూ అన్నదాతకు అండగా నిలుస్తున్నామని అన్నారు. ప్రజా జీవితంలో అనేక మంది రాజకీయ నాయకులకు సమాజ సేవ చేయాలనే లక్ష్యం ఉంటుంది కానీ అది చరణలో చేసి చూపడం అందరికీ సాధ్యం కాదని టిడిపి బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు సలగల రాజశేఖరబాబు అన్నారు. కానీ ఎంఎల్ఎ ఏలూరి ప్రజాసేవలో నిరంతరం తరిస్తూ తనకు ఎవరు సాటి లేరని నిరూపించారని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ సేవలందించడంలో ఎంఎల్ఎ ఏలూరికి సాటి లేరని జనసేన ఇంచార్జ్ పెద్దపూడి విజయ్ కుమార్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి కంటిచూపు అందించడమే లక్ష్యంగా వైద్య శిబిరాలు నిర్వహిన్న ఎంఎల్ఎ ఏలూరిని టిడిపి మహిళా నాయకురాలు ఉషారాణి అభినందించారు. ఉచిత కంటి మెగా వైద్య శిబిరానికి హాజరైన ప్రజలందరికీ అన్నదానం చేశారు.

ఇంకొల్లు : శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం స్థానిక జెడ్పి హైస్కూలులో ఆదివారం ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రిటెక్ నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి 652మంది హాజరు కాగా 315మందిని శస్త్ర చికిత్సకు వైద్యులు సిఫార్సు చేశారు. ఉదయం 7 గంటలకే ప్రజలు పెద్ద ఎత్తున క్యాంపుకు తరలి వచ్చారు. మహిళలు, పురుషులకు వేరువేరుగా ప్రత్యేక ఓపి కౌంటర్లు ఏర్పాటు చేసి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో క్యాంపు కిక్కిరిసింది. క్యాంపుకు హాజరైన వారికి వైద్య బృందం రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - హనుమంతునిపాడు

గ్రామాల్లో పాత కక్షలు నేపథ్యంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని కనిగిరి సిఐ ఖాజావలి హెచ్చరించారు. మండలంలోని రౌడీ షీటర్లుగా నమోదైన వ్యక్తులకు పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఎస్సై మాధవరావు ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పాత కక్షలు, గొడవలు మనసులో ఉంచుకొని దౌర్జన్యాలకు పాల్పడవద్దని, నాటుసార శిబిరాలు ఉంటే తొలగించాలని చెప్పారు. లేనియెడల చట్టరీత్యా శిక్షిస్తామని తెలిపారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో కలిసిమెలిసి ఉండాలని సూచించారు.

24న విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి - సంతమాగులూరు

ఈనెల 24న స్థానిక కళ్యాణ మండపంలో విజయవాడ కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెసల్ ఫోరం ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అద్దంకి ఎఇ నల్లూరి మస్తానరావు తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సిజిఆర్ఎఫ్ ఛైర్మన్ జస్టిస్ ఎన్ విక్టర్ ఇమ్మానియేల్, ఫోరం సభ్యులు, ఒంగోలు ఎస్ఇ, విద్యుత్ అధికారులు హాజరవుతారని తెలిపారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా సర్వీస్ కనెక్షన్ నెంబరు, పూర్తి అడ్రస్, సెల్ నెంబరుతో అర్జీ ఇచ్చి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలు హెచ్చు తగ్గులు, మీటర్, బిల్లుల సమస్యలు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఇతర సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లాభసాటిగా కూరగాయల సాగు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని చినకొత్తపల్లి, శ్రీనివాసనగర్, కొత్తరెడ్డిపాలెం, ధర్మవరం గ్రామాల్లో రైతులు ఎక్కువగా కూరగాయల సాగు చేస్తున్నారు. కూరగాయల సాగు వలన లాభాలు సమకూరుతున్నాయని పలువురు రైతులు చెబుతున్నారు.

వంకాయ సాగులో సస్యరక్షణ

కాయగూరల్లో రా రాజుగా పిలవబడే వంకాయ చాలా మంది ఇష్టంగా తింటుంటారు. మార్కెట్లో ఎప్పుడూ డిమాండ్ ఉంటుండటంతో రైతులు వంకాయ సాగుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఈ పంటను ఆశించే చీడ, తెగుళ్ల కారణంగా కొందరు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వంకాయలో మొవ్వ తొలుచు పురుగు, రసం పీల్చే పురుగు, నులి పురుగు కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతుంటారు. వీటి నివారణకు చర్యలు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

మొవ్వు, కాయ తొలుచు పురుగు

కాయ వంకర్లు తిరగడం, రంధ్రాలు పడటం వల్ల మార్కెట్లో ధర లభించక రైతులు నష్టపోతుంటారు. ఈ పురుగు నివారణకు ప్రొఫినోఫాస్ 2ఎంఎల్ మందు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నారు దశలో పురుగు ఆశిస్తే కొమ్మల చివర తుంచేయాలి.

తెగుళ్లు - నులిపురుగు నివారణ

నులిపురుగు ఆశించిన తోటల్లో వేర్లకు బొడిపెలు ఏర్పడతాయి. మొక్క పీలగా మారుతుంది. దీని నివారణకు రైతులు అంతరపంటగా బంతిపూల సాగు చేపట్టాలి. ఎప్పటికప్పుడు పంట మార్పిడి చేసి నులి పురుగు నివారించవచ్చు.

ఆకుమాడు, కాయకుళ్లు తెగులు

గోధు మరంగు మచ్చలు ఆకులపై ఏర్పడి పసుపు రంగుగా మారి క్రమంగా ఆకుపూర్తిగా ఎండిపోయి రాలిపోతుంది. ఈ తెగులు చల్లని వాతావరణం ఉన్నప్పుడు పంటను ఎక్కువగా ఆశిస్తుంది. కాయలు కూడా పసుపు రంగుకు మారి కుళ్లిపోతాయి. ఈ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి 3గ్రాముల చొప్పున కలిపి 10రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు పిచికారీ చేయాలని వ్యవసాయ అధికారి కె వెంకటకృష్ణ తెలిపారు.

మేలైన సస్యరక్షణ చర్యలు

పురుగు ఆశించిన కాయలు, కొమ్మలను తుంచి నాశనం చేయాలి. లింగాకర్షక బుట్టలను ఎకరాకు నాలుగు చొప్పున ఏర్పాటు చేయాలి. రైతులు తోటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి. తోటలో ఏమైనా తెగుళ్లు, చీడపీడలు కనిపిస్తే వెంటనే సంబంధిత వ్యవసాయ నిపుణుల సలహాలు తీసుకుని తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

రసం పీల్చే పురుగు (తెల్లదోమ, పేనుబంక) పురుగు ఆకుల అడుగు భాగంలో చేరి రసం పీల్చడం వల్ల ఆకులు ముడుచుకుపోతాయి. దీన్ని నివారించేందుకు ఫిప్రోనిల్ 2ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఒకవేళ తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉంటే వీటి నివారణకు ఎసిఫేట్ 1.5 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే నివారణ అవుతుందని, దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉందని ఎఇ తెలిపారు. కూరగాయల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతుకు మంచి లాభాలు వస్తాయని అన్నారు.

పారతో మట్టితీసి మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

చద్దన్నం పెట్టండి చాలు: ఉగ్ర

ప్రజాశక్తి - సిఎస్ పురంరూరల్

సామాన్య వ్యక్తిగా అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమంటూ రేగులచెలకలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' సభలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేసిన ఉపన్యాసం ప్రజల్లో ఆసక్తిని లలిగించింది. ముందుగా మొక్కలు నాటే సమయంలో ఫోటోలకు ఫోజులు ఇవ్వకుండా స్వయంగా పారతో మట్టిని తీసి మొక్క నాటి, నీళ్లు తెచ్చి మొక్కకు పోశారు. రాచరికపు హెూదాల కోసం రాలేదన్నారు. సమస్యలను పరిష్కరించి మీ ప్రేమ పొందెందుకు వచ్చానన్నారు. మీ ఊరికి వచ్చినపుడు ఒక గ్లాసు నీళ్లు ఇవ్వండి, చద్దన్నం పెట్టండి చాలు అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని కలిగించాయి. రేగులచెలక రెవెన్యూలో అక్రమాల గురించి సర్పంచ్ కృష్ణకుమారి ఉగ్ర దృష్టికి తీసుకు రాగా గత వైసీపీ ప్రభుత్వంలో వేల ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు తనదృష్టికి రాగా కలెక్టర్‌కు తెలియ జేసినట్లు చెప్పారు. స్థానికంగా వుండే వారినే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులుగా ఎంపిక చేస్తానన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ గఫార్

పర్యావరణ రక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి -కనిగిరి

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పురపాలక, అటవి శాఖ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్తంగా పర్యావరణం కోసం జీవనశైలి (లైఫ్) అంశాలపై ప్రజలకు అవగాహన ప్రచారం ఆదివారం నిర్వహించారు. పట్టణం లోని ఒంగోలు బస్టాండ్ సెంటర్ నందు శక్తిని, నీటిని పరిరక్షించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకూడదని, వ్యర్థాలను తగ్గించండంపై అవగాహన కలిగించారు. ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ లైఫ్ అంటే 'పర్యావరణ జీవనశైలి' అని అన్నారు. పర్యావరణ నాణ్యత కోసం రోజువారీ జీవితంలో చెత్త ఉత్పత్తి తగ్గించుకావాలని కోరారు. అనంతరం లైఫ్ కోసం ప్రతిజ్ఞ చేశారు. మురుగునీటి కాల్వల్లో పూడిక తీయించారు. కార్యక్రమంలో కనిగిరి, పెదిర్లపాడు ఫారెస్ట్ ఆఫీసర్లు ఎస్ నరసింహం, ఎం సునీల్ కుమార్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ ఎం రమేష్ బాబు పాల్గొన్నారు.

గౌతమి కాలేజీ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక గౌతమి విద్యాసంస్థల యాజమాన్యం వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50వేల విరాళాన్ని శాసన సభ్యులు ఏలూరు సాంబశివ రావుకు ప్రిన్సిపాల్ కాట్రగాఢ శ్రీనివాసరావు ఆదివారం అందజేశారు.

బైకు ఢీ కొని ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక పావులూరు రోడ్డులో వాకింగ్‌కు వెళ్లి వస్తుండగా ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. మురకొండ సింగయ్య, భద్రయ్య, ఆంజనేయులు, మరి కొంతమంది ప్రతిరోజు తమ ఇంటి నుంచి పావులూరు రోడ్డులో ఆంజనేయస్వామి గుడి వరకు వాకింగ్ చేస్తుంటారు. వాకింగ్ నుండి తిరిగి వస్తుండగా బూదవాడ నుంచి ఇంకొల్లు ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి వీరిని ఢీ కొట్టాడు. మద్యం సేవించి బైకు నడపడం వల్ల అదుపుతప్పి ఢీ కొట్టినట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన మురకొండ సింగయ్యను ఒంగోలు వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

ఆర్థిక సాయం చేస్తున్న పెద్దిశెట్టి చంద్ర వరలక్ష్మి

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రమాదంలో కాలు విరిగి నడవలేని స్థితిలో ఉన్న వ్యక్తి వైద్య ఖర్చులకు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు సూచనల మేరకు 29వ డివిజన్ రాజాపానగల్ రోడ్డు 8వ లైన్‌లో నివాసం ఉంటున్న వేల్పూరి వెంకటేశ్వరరావు కుమారుడు బైక్ ప్రమాదంలో కాలు విరిగి నడవలేని స్థితిలో ఉండ డంతో వైద్యం కోసం రూ.3వేలు ఆర్థిక సాయం డివిజన్ అధ్యక్షులు పెద్దిశెట్టి చంద్ర, వరలక్ష్మి ఆదివారం అందజేశారు. టిడిపి నాయకులు చారి, గుంజి విజయలక్ష్మి, డీలక్స్ మస్తాన్, సయ్యద్ రబ్బాని, పల్లపు సుమంత్, షేక్ మస్తాన్ వలి, కళ్యాణ్, వంశీ పాల్గొన్నారు.

ప్రసాద్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

ఈశ్వర ప్రసాద్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సిఎస్ఆర్ శర్మ కళాశాల మాజీ అధ్యాపకులు ఎన్ఎస్ ఈశ్వరప్రసాద్ 13వ వర్ధంతి సంద ర్భంగా స్థానిక సీతా రామపురంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఆది వారం నివాళులు అర్పించారు. విగ్రహ కమిటీ కోశాధికారిగా వి దిలీప్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. విగ్రహ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చెల్లి ప్రసాద్, చక్రపాణి, ఆయన తనయుడు శ్రీనివాస ప్రసాద్, పూర్వ విద్యార్థులు కె కళ్యాణ్, వి భక్తవత్సలం, ఎం పిచ్చయ్య, పోలయ్య, శేషగిరి పాల్గొన్నారు.

కాకానిపాలెంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని కాకానిపాలెం జెడ్పి హైస్కూల్లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించునున్నట్లు నియోజకవర్గ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ సుబ్బారావు తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు అండర్ 14, అండర్ 17 బాల, బాలికలు హాజరై ప్రతిభను చాటాలని కోరారు.

షుగరు వైద్య పరీక్షలకు హాజరైన రోగులు

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - చీరాల

రామానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో వాడరేవు ఆశ్రమంలో షుగరు ఉచిత వైద్య శిభిరం ఆదివారం నిర్వహించారు. వైద్య శిభిరంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 1137 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి నెలకు సరిపడు మందులు ఉచితంగా అందజేసినట్లు ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. శిభిరానికి హాజరైన వారందరికి అల్పాహారం, తాగునీరు, ఇతర సహాయక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సిబార్ దంత వైద్య కళాశాల వైద్య బృందం సహకారంతో దంత, నోటికి సంబంధించిన వ్యాధులు, నోటి క్యాన్సర్ నిర్ధారణకు వేలోస్కోప్ అనే ఒక ప్రత్యేకమైన పరికరంతో ఉచిత పరీక్షలు చేశారు. పరీక్షల్లో నోటి క్యాన్సర్ లక్షణాలు కనబడిన వారికి కావలసిన వైద్యం ఉచితంగా చేసేందుకు ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ మేనేజర్ ఎన్ సురేష్ తెలిపారు. క్యాంపులో డాక్టర్ ఎం రాజరాజేశ్వరి, డాక్టర్ కమలా రాజేశ్వరి, డాక్టర్ లలిత్ ప్రకాష్, డాక్టర్ శ్రీకాంత్ వైద్య పరీక్షలు చేశారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె కృష్ణారావు, సాయి ఫణికిషోర్, చందన, కామేశ్వరరావు, ఎంజి శంకర రావు, బసవరావు, కుమార్, ఎ సురేష్, మిత్ర ల్యాబ్ వలి, గోపాల్, వాడరేవు స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, చీరాల మహిళా కళాశాల విద్యార్థులు రోగులకు ఆహారం, తాగునీటి వసతులు, సహాయక ఏర్పాట్లు చేశారు.

భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు

ప్రజాశక్తి - అద్దంకి

అదనపు కట్నం కోసం భార్యను తిట్టి కొడుతున్న భర్తపై భార్య స్థానిక పోలీస్ స్టేషన్లో పోలీసులకు ఆదివారం కలిసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు పట్టణంలోని రామనగర్‌కు చెందిన గోవిసెట్టి అనిల్ కుమార్ ఒంగోలు మండలం పేర్ణమిట్ట గ్రామానికి చెందిన అనూషతో గత 11ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. వారిరువురికి ఒక పాప. ఈ మధ్య కాలం నుండి ప్రతి రోజూ రాత్రుల సమయంలో మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యపై చేయి చేసుకుంటూ తిడుతూ మీ పుట్టి ఇంటి నుండి డబ్బులు తీసుకొని రావాలని, అదనపు కట్నం తేవాలని హింసిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై అత్త రమణమ్మకు చెబితే తన కొడుకు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తాడు, నీ ఇష్టమైతే ఉండు లేకుంటే వెళ్ళిపోమ్మని బెదిరించినట్లు చెప్పడంతో ఏమి చేసేది లేక పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ ప్రవీణ తెలిపారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన ఆర్యవైశ్య కార్యవర్గం

ఆర్యవైశ్య నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - నగరం

స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆర్యవైశ్య సంఘం మండల ఎన్నికలు ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు తూనుగుంట్ల శ్రీనివాసరావు సమక్షంలో పరిశీలకులు బయ్యా ఆంజనేయులు, పొన్నూరు శ్రీనివసరావు నేతృత్వంలో ఆదివారం ఏకగ్రీవంగా నిర్వహించారు. 2024-26 సంవత్సరంనకు అధ్యక్షులు పెనుగొండ వెంకట కృష్ణారావు, ఉపాధ్యక్షులు స్వామి లక్ష్మణరావు, కార్యదర్శి దుంపా తాండవ కృష్ణ, కోశాధికారి కనికిచర్ల బాలగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పేర్ల నాగేశ్వరరావు, పేర్ల మంగయ్య, పేర్ల హనుమాన్, కాలేపల్లి సురేష్, పేర్ల రాంబాబు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని వివిధ ఎరువుల దుకాణాలను ఎఒ సుధీర్ బాబు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిటైల్ ఎరువుల దుకాణాల్లో గరిష్ఠ ధర కన్నా ఎక్కువ ధరలకు అమ్ముతున్నారనే పిర్యాదులు అందితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బ్లాక్ మార్కెటింగ్ జరుగుతుందని ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడంతో కలెక్టర్ జె వెంకట మురళి, వ్యవసాయ జిల్ల అధికారి వై రామకృష్ణ ఆదేశాలతో ఆకస్మికంగా తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డు, బిల్ బుక్స్, ఇన్వాయిస్, లైసెన్ కాపీ వంటి రికార్డులను పరిశీలించారు. యూరియా, డిఏపి, 20కి20:0:13, 10-26-26, ఎస్ఎస్పి కాంప్లెక్స్ వగైరా ఎరువుల ఉత్పాదకాలు ఎంఆర్‌పి ధరలకు మాత్రమే అమ్మాలని అన్నారు. ఉల్లంఘిస్తే రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని అన్నారు.

సంతమాగులూరు : మండలంలోని ఎరువుల దుకాణాల డీలర్లు అధిక ధరలు వసూలు చేస్తే దుకాణదారుని లైసెన్స్ రద్దు చేస్తామని మార్టూరు ఎడిఎ కెవి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పుట్టావారిపాలెం, అడ్డ రోడ్డు జంక్షన్లోని ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎఒ సుధీర్‌బాబు

దుకాణాల్లోని రికార్డులు, ఇన్వాయిస్, బిల్లు పుస్తకాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపాస్ మిషన్లో ఉన్న నిల్వలకి, గౌడౌన్లో ఉన్న నిల్వలకి వ్యత్యాసాలు లేకుండా ఎప్పటికప్పుడు రికార్డుల్లో సమాచారం తాజాపర్చుకోవాలని సూచించారు. అవకతవకలకు పాల్పడిన డీలర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో సొసైటీ ఎరువులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎఓ లావణ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్యవైశ్య సంఘం చేయూత

ప్రజాశక్తి - పంగులూరు

విజయవాడలోని వరద బాధితులకు మండల ఆర్యవైశ్య సంఘ సభ్యులు చీరలు, దుప్పట్లు, లుంగీలు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం సెక్రెటరీ సోము నాగేశ్వరరావు పంగులూరులో మాట్లాడారు. విజయవాడ వరద బాధితులకు అండగా మండలంలోని ఆర్యవైశ్యులంతా ముందుకు వచ్చి ఆర్థిక సహకారం అందించారని కోరారు. దీంతో 250దుప్పట్లు, 250చీరలు, 250లుంగీలు, వివిధ రకాల పచ్చళ్ళు కొని బాధితులకు అందించామని చెప్పారు. విజయవాడ నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, సత్యనారాయణపురం ఆర్యవైశ్య కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కనమర్లపూడి శివశేషరావు, సెక్రెటరీ సోము నాగేశ్వరరావు, కోశాధికారి సామా సురేష్ బాబు, మాజీ ప్రెసిడెంట్ మద్ది సుబ్రహ్మణ్యం, కోరిశపాడు మండల అధ్యక్షులు దేసు పుల్లారావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా సెక్రటరీ మద్దాల సంజీవరావు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : తెనాలికి చెందిన భారత్ వికాస్ పరిషత్తు సహకారంతో మడలంలోని పెసర్లంక పంచాయతీలోని పల్లెపాలెం గ్రామంలో 70కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1500లకు పైగా విలువైన దుస్తులు, దుప్పట్లు నిత్యవసర సరుకులు ఆదివారం అందజేశారు. పరిషత్ కార్యదర్శి వై హరిపూర్ణప్రసాద్, హార్దిక కార్యదర్శి పిపివి రమేష్ బాబు, బివిపి అమరావతి, బి శ్రీనివాసరావు, ప్రధానాచార్యులు వి రాజేంద్ర కుమార్, కడియాల సునీల్ కుమార్,

దుప్పట్లు పంపిణీ చేస్తున్న పంగులూరు ఆర్యవైశ్య సభ్యులు

ఆదామా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక సహాయంతో బాధితులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉల్లగుంట వెంకటేశ్వరరావు, ఆర్ సత్యనారాయణ మూర్తి, శ్రీనివాసరావు, వి సురేష్, పెసరలంక సర్పంచి వేములపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపల్లె : వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు రావాలని స్థానిక రామకృష్ణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ వీణ కోరారు. పాఠశాల యాజమాన్యం, మాజీ మంత్రి జాగర్లమూడి లక్ష్మీ పద్మావతి సంయుక్తంగా మండలంలోని పెనుమూడిలో 160 కుటుంబాలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. తెలుగుదేశం లీగల్ సేల్ కార్యదర్శి ఉప్పాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వరద బాధితులను గుర్తించి నిత్యవసరాలు, దుస్తులు అందజేశారు. విద్యతోపాటు మానవతా విలువలు, సేవా దృక్పథాన్ని పెంపొందిస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయులు బివి రెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి - పొదిలి

మానవత సేవా సంస్థ 2024-25 సంవత్సరానికి అత్యధిక సభ్యత్వాలు చేయించినందుకు సంస్థ విద్య విభాగం డైరెక్టర్ బివి రెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక గోశాలలో జరిగిన సెప్టెంబర్ నెల సమావేశంలో ఆయన చేయించిన సభ్యత్వాలను కమిటీకి అప్పగించారు. 150సభ్యత్వాలకు రూ.90వేల చెక్కును కమిటీ అధ్యక్షులు సామంతపూడి నాగేశ్వర రావు, చైర్మన్ మువ్వల పార్థసారథి, కన్వీనర్ కల్లం సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి బండి అశోక్, డైరెక్టర్లకు అందజేశారు. మానవత సేవా సంస్థకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, సంస్థ సభ్యులు కాటూరి వెంకటనారాయణరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కరీముల్లా బేగ్, డిల్ నరసింహం, సోమిశెట్టి చిరంజీవి పాల్గొన్నారు.

భార్య ఫిర్యాదుతో గృహహింస చట్టం కేసు నమోదు

ప్రజాశక్తి - ఇంకొల్లు

వంకాయలపాడు గ్రామంలోని దళిత కాలనీకి చెందిన పల్లె పోగు సిపోరి ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపులు, గృహ హింస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. యద్దనపూడి మండలం గన్నవరం గ్రామానికి చెందిన పల్లె పోగు నాగేశ్వరరావుకు రెండేళ్ల క్రితం సిపోరిని ఇచ్చి వివాహం చేశారు. అప్పట్లో కొంత బంగారం కట్నంగా ఇచ్చారు. అయితే వివాహమైన తర్వాత అదనపు కట్నం తేవాలని భర్తతోపాటు అత్త, మామ చంద్రారావు, మరిది ఆరోమ్ వేధించే వారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వేధింపులు తట్టుకోలేక ఇటీవల పుట్టింటికి వచ్చిన తనను మళ్ళీ భర్త వచ్చి రాజీచేసుకుని తీసుకుపోయాడని తెలిపారు. మళ్లీ అతింటికి పోయాక వేధింపులు ఎప్పటిలాగే ఉన్నాయని తెలిపారు. తనకు విడాకులు ఇవ్వాలని, మళ్లీ రెండో పెళ్లి చేసుకుంటానని వేధిస్తున్నా డని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 20న భర్తతో పాటు అత్త, మామ, మరిది తనని హింసించి దాడి చేశారని, బయటకు నెట్టారని పేర్కొన్నా రు. దీంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైద్య పరీక్షలు చేస్తున్న శంకర్ ఆసుపత్రి వైద్యులు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేటపాలెం

రోటరీ క్లబ్, బిబిహెచ్ జూనియర్ కాలేజీ 92బ్యాచ్, పెదకాకాని శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో స్థానిక బిబిహెచ్ జూనియర్ కాలేజీలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎస్ఐ ఎం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. రోటరీ క్లబ్ చేస్తున్న సేవలను అభినందించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు అగోరి, యోగితా శ్రీ 121మందికి వైద్య పరీక్షలు చేశారు. 27మందికి కంటి ఆపరేషన్లు, 10 మందికి కళ్లద్దాలు ఇవ్వాలని నిర్ణయించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు ఎవి సురేష్ బాబు, కార్యదర్శి వి లక్ష్మణస్వామి, వ్యవస్థాపక అధ్యక్షులు గొల్లపూడి సీతారాం, మాజీ అధ్యక్షులు బట్ట మోహనరావు, కొత్త వాసు, నున్న నాగేంద్రరావు, పొగడదండ రవికుమార్, కారంచేడు శివరామకృష్ణ, ప్రతి వెంకట సుబ్బారావు, పద్మనాభ శ్రీనివాసరావు, కళాశాల కరస్పాండెంట్ చల్ల వాసుదేవరావు, నాగబాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు డిబిఆర్సి ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ

బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కొల్లూరు

ఇటీవల కృష్ణానదికి వచ్చిన వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన తోకలవానిపాలెం, రావిలంక, చిలుమూరు లంక గ్రామాల ప్రజలకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో 450కుటుంబాలకు సరుకులు, బకెట్లు, సబ్బులు, పేస్టులు, ఇళ్లపై కప్పుకునే పరదాలు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిబిఆర్‌సి ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లాడి దేవకుమార్ మాట్లాడుతూ గత 30ఏళ్లుగా ఆపదలో ఉన్న వెనుకబాటుకు గురైన దళిత, గిరిజన ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తోకలవానిపాలెం సర్పంచ్ టి కృష్ణమోహన్ మాట్లాడుతూ కృష్ణ నది వరదల వలన లంక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. డిబిఆర్‌సి ఫైనాన్స్ మేనేజర్ నాగలక్ష్మి, సిబ్బంది రవితేజ, శ్రీలత, భగవాన్ పాల్గొన్నారు.

వెంకట్రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగరాజు

వెంకట్రావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఇలవరంకు చెందిన మాజీ ఎంపీటీసీ, టిడిపి నాయకులు జొన్నాదుల వెంకట్రావు ప్రథమ వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి టిడిపి గ్రామ అధ్యక్షులు మాచర్ల నాగరాజు, జొన్నాదుల వెంకటేశ్వరరావు, దీపాల ప్రసాదు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జొన్నాదుల పాపారావు, రమేష్, సురేష్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

ఊరచెరువులో చెత్త డంప్ చేయొద్దు..

-మించినీటి చెరువుగా అభివృద్ధి చేయాలి
-ఊరచెరువులో సిపిఎం నేతల నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఊరచెరువులో చెత్తను డంప్ చేయరాదని, ఊరచెరువులోని ఖాళీ స్థలంలో వ్యర్థాలను తొలగించి మంచినీటి చెరువును ఏర్పాటు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఊరచెరువులో చెత్తను డంప్ చేయవద్దని ఆపార్టీ బండ్లమిట్ట శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఊరచెరువులో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆపార్టీ నాయకులు మాట్లాడుతూ ఊరచెరువులో చెత్తను డంప్ చేయడం వల్ల చుట్టుపక్కల ప్రజలు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. మార్కెట్‌కు వచ్చే ప్రజలకూ ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఊరచెరువును అభివృద్ధి చేసి, మంచినీటి చెరువుగా మార్చాలని కోరారు. చెరువు చుట్టూ ఏడు ఎకరాలలో వాకింగ్ ట్రాక్, పిల్లల పార్కు ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కడ చెరువును నెలకొల్పడం వల్ల ఆ ప్రాంతంలో భూగర్భజలాలు పెరుగుతాయని తెలిపారు. ఊరచెరువు అభివృద్ధికి ప్రభుత్వం, పాలకవర్గం చర్యలు చేపట్టాలని కోరారు. చెరువు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలన్నారు. చెరువు అభివృద్ధిని ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టవద్దని సూచించారు. హైడ్రా తరహాలో వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి జి రమేష్, నాయకులు మారెళ్ల సుబ్బారావు, సిపిఎం నాయకులు, మాజీ కౌన్సిలర్ కె విశ్వసేన్, టి భక్తసింగ్‌రాజు, సిపిఎం బండ్లమిట్ట శాఖ కార్యదర్శి పి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

మంజూరైన వెంటనే స్తంభాలు వేస్తాం: ఎఇ

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రజాశక్తి కథనానికి స్పందన

కరెంటు స్తంభాలు అవసరమని ఉన్నతాధికారులకు లేఖ రాశామని, ఆ స్తంభాలు రాగానే పాడైన కరెంటు స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు వేస్తామని శింగరాయకొండ విద్యుత్ శాఖ ఎఇ సాంబశివరావు తెలిపారు. శనివారం నాడు ప్రజాశక్తిలో ప్రచురించిన 'గాలొస్తే.. గడగడే..' అనే వార్తకు అధికారులు స్పందించారు. ప్రస్తుతం స్తంభాల కొరత ఉందని స్తంభాలు వచ్చిన వెంటనే అక్కడ స్తంభాలు వేస్తామని వెల్లడించారు.

వైసిపి నేతలు

అబద్ధాలు చెప్పటం సిగ్గుచేటు

- దామచర్ల ఆంజనేయులు జీవితం ఆదర్శనీయం
- రాష్ట్ర మంత్రి స్వామి

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, వైసీపిని ప్రజలు ఛీ కొట్టినా తీరు మార్చుకోకుండా పదేపదే ఆ పార్టీ నేతలు అబద్ధాలు చెప్పటం సిగ్గుచేటని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి అన్నారు. మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు 17వ వర్ధంతి ఆదివారం నాడు టంగుటూరు మండలం, తూర్పు నాయుడుపాలెంలో నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి స్వామి మాట్లాడుతూ దామచర్ల ఆంజనేయులు సామాన్య రైతు కుటుం బంలో పుట్టి స్వయంకృషితో సర్పంచి స్థాయి నుంచి మంత్రి స్థాయికి ఎదిగారన్నారు. ఆయన జీవితం ఆదర్శనీయమన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా మహిళలకు రూ.1500 ఇచ్చే పథకాన్ని ఈ ఆర్థిక సంవత్సరం నుంచే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేసి.. నాలుగు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. సత్య, జనార్ధన్ ముందుకొచ్చినట్లయితే ఈ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొస్తా మని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డిపై ఆ పార్టీ నాయకులకు కూడా విశ్వాసం లేదన్నారు. కార్యమానికి టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపీలు మాగుంట శ్రీనివాసులరెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, దామచర్ల జనార్ధన్, ఏలూరి సాంబశివరావు, ఇంటూరి నాగేశ్వరరావు, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు నూకసాని బాలాజీ, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, గూడూరి ఎరిక్షన్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు పోతుల రామారావు, దివి శివరాం, నారపుశెట్టి పాపారావు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

దామచర్ల ఆంజనేయులు వర్ధంతి తూర్పునాయుడుపాలెంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడుపాలెం గ్రామంలో మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరాలను మంత్రి స్వామి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డితో కలిసి ప్రారంభించారు. 60 సాఫ్ట్‌వేర్, నాన్ సాఫ్ట్‌వేర్ కంపెనీలతో నిరుద్యోగులకు జాబ్ మేళాని మంత్రి ప్రారంభించారు. మల్లవరప్పాడులో ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలను ప్రారంభించారు. అనంతరం నాయుడుపాలెంలో రూ.4.50 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి, లావు శ్రీకృష్ణ దేవరాయలు, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, నూకసాని బాలాజీ, టంగుటూరు మాజీ ఎంపిపి చదలవాడ చంద్రశేఖర్, టంగుటూరు మాజీ సర్పంచి బెల్లం జయంతిబాబు, జరుగుమల్లి మాజీ ఎంపిపి బెల్లం సత్యన్నారాయణ, విద్యుత్ శాఖ ఎస్ఇ కెవిజి.సత్యన్నారయణ, ఈఈ శ్రీనివాసులు, ఆర్.మోహనరావు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల సూర్యలంక బీచ్ వద్ద జరిగిన ఏసుబాబు హత్య కేసులో నిందితుడు కొక్కిలిగడ్డ చంద్రశేఖర్‌ను ఆదివారం బాపట్ల రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామాంజనేయులు వివరాలు వెల్లడించారు. సూర్యలంక గ్రామ శివారు చప్టా సమీపంలో ఈ నెల 16న బాపట్ల హనుమంతరావు కాలనీకి చెందిన బాచు ఏసుబాబు హత్యకు గురయ్యారు. మతుడు ఏసుబాబు బాపట్ల చుట్టుపక్కల గ్రామాలలో ఫైనాన్సు వ్యాపారం చేస్తూ.. ఒక నెల క్రితం ఆదర్శనగర్ గ్రామానికి చెందిన నిందితుడు అయిన కొక్కిలిగడ్డ చంద్రశేఖర్ అనే వ్యక్తిని తన వద్ద గుమస్తాగా పెట్టుకున్నాడు. హత్యకు వారం రోజుల ముందు నుంచి ముద్దాయి చంద్రశేఖర్ తాను వసూలుచేసిన ఫైనాన్స్ డబ్బుల లెక్కలు సరిగా చెప్పకుండా వేధిస్తూ వచ్చాడు. ఈ విషయమై గొడవ జరిగింది. ఈ నెల 16న చంద్రశేఖర్ ఫైనాన్స్ డబ్బులు ఇస్తానని చెప్పడంతో మృతుడు సూర్యలంక వెళ్లాడు. అయితే నిందితుడు చంద్రశేఖర్ డబ్బులు విషయంలో గొడవపడి చంపాలనే ఉద్దేశంతో ఏసుబాబును మెడ వద్ద కత్తితో పొడిచి.. చంపేసి పరారయ్యాడు. హత్య కేసును త్వరితగతిన ఛేదించేందుకు ఎస్పీ తుషార్‌డూడీ అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్ ఆధ్వర్యంలో బాపట్ల డిఎస్పీ జి రామాంజనేయులు, బాపట్ల రూరల్ సిఐ కె గంగాధర్, పోలీస్ సిబ్బందితో ప్రత్యేక బందాన్ని ఏర్పాటుచేశారు. నిందితుడిని అరెస్టు చేశారు. న్యాయస్థానంలో ముద్దాయికి కఠిన మైన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని డిఎస్పీ జి.రామాంజనేయులు తెలిపారు. కేసు ఛేదనలో విశిష్ట కృషి చేసిన అడిషనల్ ఎస్పీ, బాపట్ల, డిఎస్పీ, బాపట్ల రూరల్ సిఐ గంగాధర్, బాపట్ల రూరల్ పోలీసులను ఎస్పీ అభినందించారు.

పండ్ల తోటల రైతులకు రాయితీలు

- హైబ్రీడ్ కూరగాయల పథకం అమలు
- 90 ఫారమ్ పాండ్స్ నిర్మాణం
- ఉద్యాన యాంత్రీకరణ పథకంలో రైతులకు యంత్రాలు
- జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్

ముఖాముఖి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఉద్యాన రైతుల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు జిల్లా ఉద్యాన అధికారి వైఎంఎన్‌విఎస్ గోపీచంద్ తెలిపారు. జిల్లా సమగ్ర ఉద్యాన పంటల అభివృద్ధి పథకంలో పండ్ల తోట సాగు చేస్తున్న రైతులకు రాయితీలు ఇస్తున్నామన్నారు. హైబ్రీడ్ కూరగాయల పథకంలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. పండ్ల తోటలలో నీరు నిల్వ చేయటానికి 90 ఫారమ్ పాండ్స్ నిర్మిస్తున్నామన్నారు. ఉద్యాన యాంత్రీకరణ పథకంలో 50 శాతం రాయితీపై 354 యంత్రాలు రైతులకు అందజేస్తామన్నారు. జిల్లా ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న రాయితీలను డిహెచ్‌ఒ 'ప్రజాశక్తి'కి వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు జిల్లాలోని ఉద్యాన రైతులకు అవసరమైన రాయితీలు అందించేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం సాధించేందుకు చర్యలు చేపడుతున్నా.

పండ్ల తోటల రైతులకు రాయితీలు

జిల్లా సమగ్ర ఉద్యాన పంటల అభివద్ధి మిషన్ (ఎంఐడిహెచ్) 2024-25లో కొత్తగా పండ్ల తోటలు సాగు చేసే రైతులకు 40 శాతం రాయితీతో పండ్ల తోటల సాగుకు 402.00 హెక్టార్లల్లో రూ.83.82 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. ఇప్పటి వరకు 194.46 హెక్టార్లల్లో లబ్ధిదారుల రుల ఎంపిక చేశాం. 75, 90 శాతం రాయితీపై రెండవ, మూడవ సంవత్సరం పండ్ల తోటల నిర్వహణకు 613.93 హెక్టార్లకు రూ. 24.68 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. 550.60 హెక్టార్లల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేశాం

హైబ్రీడ్ కూరగాయల విస్తరణ పథకం అమలు

హైబ్రీడ్ కూరగా యల విస్తరణ పథకంలో ఒక హెక్టారుకు రూ.20 వేలు చొప్పున ఆర్థిక సహాయంతో 137 హెక్టార్లలో రూ.27.40 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. ఇప్పటి వరకు 7.20 హెక్టార్లల్లో లబ్దిదారులను ఎంపిక చేశాం. పూల తోటల సాగు విధకంలో ఒక హెక్టారుకు రూ.16 వేలు చొప్పున ఆర్థిక సహాయంతో 260.00 హెక్టార్లలో రూ.41.60 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం 11.85 హెక్టార్లల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది.

90 ఫారం పాండ్స్ నిర్మాణం

పండ్ల తోటలలో నీరు నిల్వ చేయటానికి 90 ఫారం పాండ్స్ (నీటి కుంటలు) నిర్మాణానికి రూ.75 వేల చొప్పున రూ.32.25 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. నాలుగు కమ్యూనిటి ఫారం పాండ్ (నీటి కుంట) నిర్మాణానికి రూ.80 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. ఇప్పటి వరకు 22 ఫారం పాండ్స్ నిర్మాణానికి పరిపాలన అనుమతి ఇచ్చాం. రక్షిత వ్యవసాయ పథకంలో 50 శాతం రాయితీపై అధిక విలువ కలిగిన కూరగాయలు, పూల తోటల సంవత్సరం పొడవున సాగు చేయటానికి 3.90 హెక్టార్లలో రూ.1.41 కోట్లకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. దానిమ్మ తోటల్లో రక్షణ వలలకు 62.50 హెక్టార్లలో రూ.20.73 లక్షలకు కార్య ప్రణాళిక ఆమోదించబడినది. కాగా 2.40 హె.లలో లబ్దిదారులను గుర్తించాం.

మల్చింగ్ పథకంలో రైతులకు రాయితీలు

సమగ్ర నీటి వినియోగంతో పండ్లు, కూరగాయల తోటలు సాగు చేసే రైతులకు మల్చింగ్ పథకంలో 50 శాతం రాయితీపై 240 హెక్టార్లలో రూ.38.40 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. ఇప్పటి వరకు 23.82 హెక్టార్లల్లో మల్చింగ్ పాటించిన లబ్దిదారులను గుర్తించాం. కోత అనంతరం పంట నిల్వ చేసుకోవటానికి 77 (ప్యాక్ హౌస్ లు, శీతల గిడ్డంగులు, రైపనింగ్ చాంబర్స్, కోల్డ్ రూమ్స్, ప్రత్యామ్నాయ సాంకేతిక పద్ధతులకు) రూ.10.69 కోట్లతో కార్య ప్రణాళిక ఆమోదించాం. ఇప్పటి వరకు 11 లబ్దిదారులకు పరిపాలన అనుమతి మంజూరు చేశాం. 40 శాతం రాయితీపై మార్కెటింగ్ మౌలిక సదుపాయాల ఏర్పాటులో రూ.1.20 కోట్లకు కార్య ప్రణాళికను అమలు చేస్తున్నాం. ఇప్పటి వరకు ఇద్దరు లబ్దిదారులకు పరిపాలన అనుమతి మంజూరు చేశాం

50 శాతం రాయితీపై యాంత్రీకరణ పథకం

ఉద్యాన యాంత్రీకరణ పథకంలో 50 శాతం రాయితీపై 354 (మిని ట్రాక్టర్లు, ఫ్లవర్ బిల్లర్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు) రూ.69.00 లక్షలకు కార్య ప్రణాళిక ఆమోదించాం. సమీకత పోషక నిర్వహణ, సమీకత సస్యరక్షణలో 50 హెక్టార్లలో రూ.0.60 లక్షలకు కార్య ప్రణాళిక ఆమోదించాం.